ప్రజాశక్తి

ఆదివారం 25 ఫిబ్రవరి 2024 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

తెలుగుదేశం అభ్యర్థులు వీరే..

- **ప్రకాశం జిల్లాలో ఐదు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన అధిష్ఠానం**
- **దర్శి, గిద్దలూరు, మార్కాపురం నియోజకవర్గాలు పెండింగ్**

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

జిల్లాలో ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులను తెలుగుదేశం అధిష్ఠానం శనివారం ప్రకటించింది. తొలి జాబితాలో ఐదు నియోజవర్గాలకు అభ్యర్థులను వెల్లడించారు. మరో మూడు స్థానాల్లో అభ్యర్థుల ఎంపికపై తర్జనభర్జనలు సాగు తున్నాయి. జనసేనకు ఒక నియోజకవర్గం కేటాయించాల్సి ఉన్నందున వాటిపై ఇంకా తుది నిర్ణయానికి రాలేక పోయారు. దీంతో మూడు నియోజకవర్గాలు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. టిడిపి అధ్యక్షుడు చంద్రబాబు విడుదల చేసిన జాబితాలో ఐదు నియోజకవర్గాలకు ఇప్పటికే ఇన్‌ఛార్జిలుగా ఉన్న నేతలే అభ్యర్థులుగా పోటీచేయనున్నారు. ఒంగోలు-దామచర్ల జనార్ధన్, కొండపి- డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, కనిగిరి- డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, యర్రగొండపాలెం- గూడూరి ఎరిక్షన్‌బాబు, సంత నూతలపాడు- బిఎన్.విజయకుమార్ ఉన్నారు. యర్రగొండ పాలెంలో పోటీచేసే గూడూరి ఎరిక్షన్‌బాబు తొలిసారిగా అసెంబ్లీకి పోటీచేస్తున్నారు. మిగతా వారంతా ఈపాటికే అసెంబ్లీకి గతంలో ఎన్నికయ్యారు. కొండపి ఎమ్మెల్యే వీరాంజనేయస్వామి రెండుసార్లు గెలిచారు. ప్రస్తుతం సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్నారు. ఈపాటికే ఎన్నికల ప్రచారాలు, వ్యూహాల్లోనే ఉన్నారు.ఈ స్థానాల్లో ఇతర నేతలు కూడా టిక్కెట్లు ఆశిస్తున్న పరిస్థితి లేదు. పార్టీ కార్యక్రమాలు సమర్ధవంతంగా నిర్వహిస్తూ ఎన్నికలకు సన్నాహాల్లోనే ఉన్నారు. ఇక జనసేనకు ఒకస్థానం కేటాయించాల్సి ఉంది. ఇప్పటి వరకూ దర్శి నియోజకవర్గమే చర్చలో ఉంది. అక్కడ కొత్తగా ఎన్ఆర్ఐ గరికపాటి వెంకట్ రాజకీయ ఆరంగేట్రం చేశారు. ప్రారంభంలోనే ఎడ్లపందాలు భారీఎత్తున నిర్వహించారు. నియోజక వర్గంలోపర్యటనలు చేశారు. తెలుగుదేశంతో కలిసి హడావిడి చేశారు. అయితే ఇక్కడ అభ్యర్థిపై తెలుగుదేశం, జనసేన అధిష్టానాలు స్పష్టతకు రాలేదు. దీంతో ఈయన వేగం తగ్గించారు. ఇటీవల టిడిపిలో చేరిన మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచుగరటయ్య తన కుమారుడు కృష్ణచైతన్యకు దర్శి నుంచి టిక్కెట్ కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటిపైనా వత్తిడి చేస్తున్నారు. ఈ కారణాల రీత్యా దర్శి అభ్యర్థిపై తెలుగుదేశం, జనసేన అవగాహనతో నిర్ణయానికి రావాల్సి ఉంది. అందుకే పెండింగులో పెట్టారు. మార్కాపురంలో కందుల నారాయణరెడ్డి, గిద్దలూరులో మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఇన్‌ఛార్జిగా ఉన్నారు. గిద్దలూరు సీటు జనసేన ప్రతిపాదనల్లో ఉన్నందునే ఇంకా ఖరారు చేయలేదంటున్నారు. దర్శి లేదా గిద్దలూరు స్థానాల్లో ఒకటి జనసేనకు కేటాయిస్తారనే చర్చ ఉంది. ఏదో ఒకస్థానంపై తుదినిర్ణయానికి వచ్చాకే రెండో జాబితాలో అవకాశం ఉంటుందని చెబుతున్నారు. ఈ కారణాలతో ఈ రెండు ఆగిపోయాయి. మార్కాపురంలో అభ్యర్థి మార్పు దిశగా అధిష్టానం ఆలోచిస్తుందనే చర్చ సాగుతోంది. తాజాగా సర్వేలపేరుతో నియోజకవర్గంలోని కొందరికి ఫోన్లు వచ్చాయి. ఈ కారణాలరీత్యా మార్పు ఉంటుందా?అనేదీ చూడాలి.బలమైన నేతలకోసం అన్వేషణ నడుస్తుందా? నారాయణరెడ్డినే అభ్యర్థిగా రంగంలోకి దించుతారా?అనేదీ తేలాల్సి ఉంది. అభ్యర్థులు ఖరారవ్వడంతో పార్టీ కార్యకర్తలు, అభిమానులు నియోజకవర్గాల్లో బాణా సంచాలు కాల్చి సంబరాలు చేసుకున్నారు.



దామచర్ల జనార్ధన్



డోలాశ్రీ బాలవీరాంజనేయ స్వామి



ముక్కు ఉగ్రనరసింహారెడ్డి



బిఎన్. విజయ్‌కుమార్



గూడూరి ఎరిక్షన్‌బాబు



గొట్టిపాటి రవికుమార్



ఏలూరి సాంబశివరావు



నక్కా ఆనంద్‌బాబు

- **బాపట్ల జిల్లాలో ఐదు స్థానాలకు అభ్యర్థుల ప్రకటన**
- **చీరాల నియోజక వర్గ అభ్యర్థి పెడింగ్**



వేగేశన నరేంద్ర వర్మ



అనగాని సత్యప్రసాద్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లాల్లో అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే టిడిపి అభ్యర్థుల మొదటి జాబితాను ఆ పార్టీ అధినేత చంద్రబాబు శనివారం ప్రకటించారు. జిల్లాల్లో ఐదు నియోజక వర్గాల అభ్యర్థుల పేర్లు ప్రకటించారు. చీరాల నియోజకవర్గ అభ్యర్థిని పెండింగ్ లో పెట్టారు. ప్రస్తుతం టిడిపి చీరాల నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఎంఎం. కొండయ్య ఉన్నారు. రేపల్లే ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌ను మళ్లీ అభ్యర్థులుగా ప్రకటించారు. టిడిపి బాపట్ల, వేమూరు నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు వేగేశన నరేంద్ర వర్మ,నక్కా ఆనందబాబు టిక్కెట్లు ఖరారు చేశారు. అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అద్దంకి నుంచి 2009, 2014, 2019 ఎన్నికల్లో విజయం సాధించారు. 2004లో మార్టూరు ఒకసారి ఎమ్మెల్యేగా గెలిచారు. మళ్లీ అద్దంకి నుంచే పోటీలో ఉన్నారు. టిడిపి బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు 2014,2019 ఎన్నికల్లో వరుసగా విజయం సాధించారు. మూడో సారి ఎన్నికల బరిలో ఉన్నారు. రేపల్లే ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ 2014, 2019 ఎన్నికల్లో విజయం సాధించారు. మూడో సారి అక్కడ నుంచే పోటీ చేస్తున్నారు. మాజీ మంత్రి నక్కా ఆనందబాబు వేమూరు నుంచి 2009, 2014లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2019లో ఓటమి చెందారు. బాపట్ల నియోజక వర్గ నుంచి వేగేశన నరేంద్రవర్మ మొదటిసారి ఎన్నికల బరిలో దిగారు.

గ్రూపు -2 పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- **పటిష్ట పోలీసు బందోబస్తు**
- **పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్**
- **ఎస్‌పి వకూల్ జిందాల్**

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

రాష్ట్రవ్యాప్తంగా ఎపిపిఎస్‌సి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహిస్తున్న గ్రూప్ 2 పరీక్షలకు జిల్లాలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లాలో మొత్తం 25 పరీక్షా కేంద్రాలలో 7,671 మంది గ్రూప్ 2 పరీక్షలకు హాజరు కానున్నట్లు ఎస్‌పి తెలిపారు. అందుకు అనుగుణంగా పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముగ్గురు డిఎస్‌పిలు, 12 మంది సిఐలు, 25 మంది ఎస్ఐలు కలిపి మొత్తం 224 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది బందోబస్తు నిర్వహించ



మాట్లాడుతున్న ఎస్‌పి వకుల్ జిందాల్

నున్నట్లు తెలిపారు. గ్రూప్ 2 స్క్రీనింగ్ టెస్ట్ పరీక్షలు రాసే అభ్యర్థులు హాల్ టికెట్‌లో సూచించే నియమ నిబంధనలు పాటించాలన్నారు. హాల్ టికెట్ తో పాటు ప్రభుత్వ గుర్తింపు పొందిన ఏదైనా ఒరిజినల్ ఐడి కార్డ్ తో ఉదయం 9 గంటలకు ▶ 2లో

చేసిన పనులకు ఆమోదం ఏంటి...?

- **మేయర్‌ను ప్రశ్నించిన ప్రతిపక్ష కార్పొరేటర్లు**
- **జగనన్న కాలనీలలో పనులకు కౌన్సిల్ అనుమతి తీసుకోక పోవడంపై ఆగ్రహం**
- **చర్చ లేకుండానే ఒక్క అంశం మినహా అజెండా అంతా ఆమోదం**



మేయర్ పోడియం వద్ద నిరసన తెలుపుతున్న ప్రతిపక్ష కౌన్సిలర్లు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

'ఏదైనా అభివృద్ధి పని చేసేటప్పుడు ముందుగా కౌన్సిల్ సమావేశంలో చర్చకు పెట్టాలి. కౌన్సిల్‌లో చర్చించి ఆమోదించిన తరువాతనే పనులు చేపట్టాలి. అలాంటిదేమి లేకుండానే రూ.21.33కోట్ల విలువైన పనులు చేసేశారు. మేయర్ ముందస్తు అనుమతి పేరుతో పనుల్లో గోల్‌మాల్ చేశారు. పనులు పూర్తి అయిన తరువాత ఇప్పుడు కౌన్సిల్ ఆమోదానికి పెట్టారు. చేసిన పనులకు ఆమోదం తెలపడం ఏంటి..?' అని ప్రతిపక్ష టిడిపి, జనసేనపార్టీ కార్పొరేటర్లు ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాతను నిలదీశారు. నవ రత్నాలు. .పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా నగరంలోని ఎన్.అగ్రహారం, వెంగముక్కపాలెం వద్ద 21 వేల మందికి రెండు రోజుల కిందట ముఖ్యమంత్రి ▶ 2లో

గ్రూపు-2 పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

(మొదటిపేజీ తరువాయి)

పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకోవాలన్నారు. పరీక్ష పూర్తయ్యేంత వరకు పరీక్షా కేంద్రం నుంచి అభ్యర్థులు బయటకు వెళ్లేందుకు అనుమతించ బడదన్నారు. అభ్యర్థులు మాల్ ప్రాక్టీస్, చెడు ప్రవర్తనకు పాల్పడితే ఎపి పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ మాల్ ప్రాక్టీస్ అండ్ అన్ ఫెయిర్ మీన్స్) యాక్ట్, 1997 చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌పి హెచ్చరించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద సమస్యలు ఉత్పన్నమైతే డయల్ 100, 112 లేదా బాపట్ల ఎస్‌పి హెల్ప్ లైన్ నెంబర్ 8333813228 కు కాల్ చేయాలని ఎస్‌పి సూచించారు.

పరీక్షలకు సర్వం సిద్ధం

ఒంగోలు కలెక్టరేట్ : గ్రూప్-2 పరీక్షలకు సర్వం సిద్ధమైంది. ప్రకాశం జిల్లాలో 49 కేంద్రాలలో ఆదివారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్షలు జరగనున్నాయి. పరీక్షలు మొత్తం 21,565 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. 49 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 49 కేంద్రాలను 15 రూట్లుగా విభజించి 15 మంది జిల్లా అధికారులను రూట్ ఆఫీసర్లగా నియమించారు. లైజన్ అధికారులుగా తహశీల్దార్లను నియమించారు. లైజన్ అధికారులు పరీక్షా కేంద్రాల వద్ద సిసి కెమెరాలు, సీటింగ్ ఏర్పాట్లు, తాగు నీటి సదుపాయం, మహిళలు, పురుషులకు వేర్వేరుగా టాయిలెట్లు ఏర్పాట్లు చేశారు. పరీక్ష హాల్‌లో ప్రతి రూమ్ వద్ద అభ్యర్థుల నెంబర్లు, రూమ్ లను చూపేలా డిస్ప్లే బోర్డులు ఏర్పాటు చేశారు. వికలాంగులకు, గర్భిణులకు గ్రౌండ్ ఫ్లోర్‌లోనే పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.

అన్నా రాంబాబుకు మద్దతుగా ప్రచారం

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం ఎమ్మెల్యే అభ్యర్థి అన్నా రాంబాబును గెలిపించాలని కోరుతూ ఈరోజు తర్లుపాడు మండలం చెన్నారెడ్డిపల్లి గ్రామంలో ని ముఖ్య నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు తదితరులు ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తర్లుపాడు మండల పరిశీలకులు ఏరువ శివన్నారాయణరెడ్డి, తర్లుపాడు మండల ఎంపీపీ సూరెడ్డి భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, మండల కన్వీనర్ మురారి వెంకటేశ్వర్లు, తర్లుపాడు మండల జేసీఎస్ కన్వీనర్ రామాంజనేయరెడ్డి, సొసైటీ ప్రెసిడెంట్ రామిరెడ్డి, మాజీ సొసైటీ ప్రెసిడెంట్ సత్యనారాయణరెడ్డి, దేవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, సర్పంచులు తాడి రమణారెడ్డి, గుమ్మా ప్రసాద్, గాయం శ్రీనివాసరెడ్డి, వెన్న సత్యనారాయణరెడ్డి, కుందురు శ్రీకాంత్‌రెడ్డి రాజారపు శేషయ్య తదితరులు పాల్గొన్నారు.



మోటారు సైకిళ్లు పంపిణీ చేస్తున్న బూచేపల్లి

మూడు చక్రాల మోటారు సైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి-దర్శి: జిల్లా పరిషత్ నిధుల నుంచి వికలాంగులకు మూడు చక్రాల ఆరు మోటారు సైకిళ్లను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి మాజీ ఎమ్మెల్యే, వైసీపీ ఇన్‌ఛార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పంపిణీ చేశారు. శనివారం స్థానిక బూచేపల్లి నివాసం వద్ద వికలాంగులకు ఆరు మోటారు సైకిళ్ల పంపిణీ చేయడం ఆనందంగా ఉందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వికలాంగులకు మంచి గుర్తింపు ఇచ్చారని, అన్ని రంగాల్లో వారికి అవకాశాలు కల్పించారని అన్నారు. తమ ట్రస్టు ద్వారా వికలాంగులను ఆదుకుంటున్నట్లు చెప్పారు. డిప్యూటీ డీఓ హనుమంతరావు, ఎంపీడీఓలు రాఘవేంద్ర, హనుమంతరావు, దర్శి మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, సానికొమ్ము తిరుపతిరెడ్డి, ఎస్ఎం బాషా, జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షులు గోపాల్‌రెడ్డి, దాసరి లక్ష్మీ రామ్‌గోపాల్‌రెడ్డి, నారాయణ, శ్రీనివాసరెడ్డి, సోము దుర్గారెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేసిన పనులకు ఆమోదం ఏంటి?

(మొదటి పేజీ తరువాయి)

ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. అక్కడ లే అవుట్ల అభివృద్ధికి ప్రభుత్వం రూ.21.33కోట్లు నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో ఆరెండు లే అవుట్లలో భూమి చదును చేసి, హద్దురాళ్లు ఏర్పాటు చేశారు. ఈ నిధులు ఖర్చు చేసే విషయంలో నిబంధనలు ప్రకారం కౌన్సిల్ ఆమోదం తీసుకొని టెండర్లు పిలిచి పనులు చేపట్టాల్సి ఉంది. అందుకు విరుద్ధంగా అత్యవసర పనులు పేరుతో మేయర్ అక్కడ పనులు నిర్వహించేందుకు ముందస్తు అనుమతులు ఇచ్చారు. కలెక్టర్ ఆదేశాలను సాకుగా చూపి టెండర్ల ప్రక్రియలో కూడా నిబంధనలు పాటించలేదని ప్రతిపక్ష సభ్యులు మేయర్‌ను నిలదీశారు. ఒంగోలు నగరపాలక సంస్థ కౌన్సిల్ అత్యవసర సమావేశం మేయర్ గంగాడ సుజాత అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇటీవల జగనన్న లే అవుట్లలో చేపట్టిన రూ.21.33 కోట్ల విలువైన పనులకు మేయర్ ముందస్తు అనుమతులు ఇచ్చినందున వాటిని ఆమోదించాలని కౌన్సిల్ అజెండాలో పెట్టారు. మొత్తం 12 అంశాలుగా వీటిని అజెండాలో చేర్చారు. దీనిపై ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ కార్పొరేటర్ దాచర్ల రమణయ్య అభ్యంతరం తెలిపారు. పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు తాము వ్యతిరేకం కాదని, అక్కడ పనులు చేపట్టాల్సి వస్తే అత్యవసర కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి కౌన్సిల్ ఆమోదం తీసుకున్న తరువాత పనులు చేపడితే పారదర్శకంగా ఉండేదని వివరించారు. హడావిడిగా చేసిన పనుల్లో అనేక తప్పిదాలు, అవకతవకలు జరిగాయని ఆరోపించారు. ఈవిషయంపై జనసేన కార్పొరేటర్ మలగా రమేష్ కూడా అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో స్పందించిన మేయర్ సుజాత ముఖ్యమంత్రి కార్యక్రమం షెడ్యూల్ తక్కువ సమయంలో ఉండటం, త్వరలో ఎన్నికలు కోడ్ వస్తుందనే సంకేతాలు రావడంతో లేఅవుట్లు అభివృద్ధికి ముందస్తు అనుమతి ఇచ్చినట్లు చెప్పుకొచ్చారు. ఇది మంచి పద్ధతి కాదని ప్రతిపక్ష కార్పొరేటర్లు తెలిపారు. డిప్యూటీ మేయర్లు వెలనాటి మాధవరావు, వేమూరి బుజ్జి కలగజేసుకొని ఇది పేదలకోసం చేసిన పని అని వివరించారు. లే అవుట్ల అభివృద్ధికి విడుదల చేసిన డబ్బులు కూడా ప్రభుత్వమే నేరుగా ఇచ్చిందన్నారు. అందుకే హడావిడిగా పనులు చేయాల్సి వచ్చిందని వివరించారు. ఈక్రమంలో అజెండాలో లే అవుట్ల అభివృద్ధికి సంబంధించిన 12 అంశాలను ఆమోదించినట్లు కొంతమంది అధికార పార్టీ కార్పొరేటర్లు బల్లలు చరుస్తూ ప్రకటించారు. మేయర్ కూడా ఆమోదించినట్లు ప్రకటించారు. దీనికి నిరసనగా ప్రతిపక్ష టిడిపి, జనసేన కార్పొరేటర్లు మేయర్ పోడియం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అజెండాలోని అంశాలపై చర్చ లేకుండా ఎలా ఆమోదిస్తారని మేయర్‌తో వాగ్వాదానికి దిగారు. ఇంతలో మేయర్ పోడియం వద్దకు వచ్చిన అధికార పార్టీ కార్పొరేటర్లు అజెండాలోని ఒక్క అంశం మినహా మిగిలిన 13 అంశాలను కూడా ఆమోదించినట్లు చెప్పారు. దీంతో మేయర్ ఎలాంటి ప్రకటన చేయకుండానే కౌన్సిల్ హాలు నుంచి వెళ్లిపోయారు. సమావేశం ముగిసినట్లు ప్రటించారు. అజెండాలో 19వ అంశం మినహా మొత్తం అజెండాను ఆమోదించినట్లు సమావేశం ముగిసిన తరువాత మేయర్ విలేకర్లకు తెలిపారు. ఈవిషయంపై ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ కార్పొరేటర్ దాచర్ల రమణయ్య, జనసేన పార్టీ కార్పొరేటర్ మలగా రమేష్ మాట్లాడుతూ కౌన్సిల్ సమావేశాల్లో ప్రతిపక్ష సభ్యులకు కనీసం మాట్లాడే అవకాశం కూడా ఇవ్వడం లేదన్నారు. మెజారిటీ ఉందని వారి ఇష్టానికి పనులు ఆమోదించు కుంటున్నారని తెలిపారు. జగనన్న కాలనీ లే అవుట్ల అభివృద్ధి పేరుతో జరిగిన పనుల్లో భారీ అవకతవకలు జరిగాయని తెలిపారు. ఈపనులను రికార్డు చేసే ఇంజినీర్లు భవిష్యత్తుల్లో ఇబ్బందులు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు.

సిఎం మీటింగ్‌లో అవమానం జరిగింది..

పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ కోసం శుక్రవారం ఎన్ అగ్రహారం వద్ద నిర్వహించిన ముఖ్యమంత్రి సభలో తమకు తీవ్ర అవమానం జరిగిందని అధికార పార్టీ కార్పొరేటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు డ్యూటీ పాస్‌లు మంజూరు చేశారని, ముఖ్యమంత్రి సభా వేదిక వద్ద మున్సిపల్ శానిటేషన్ వర్కర్లుకు, తమకు ఒకే రకం పాసులు ఇవ్వడంతో పోలీసులు తమను సభలోపల ఏర్పాటు చేసిన గ్యాలరీలలోకి అనుమతించలేదని వాపోయారు. తాము ఎక్కిన బస్సును కూడా పోలీసులు అడుగడుగున అడ్డుకున్నారని తెలిపారు. కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే తాము అవమానాలకు గురికావాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేటర్లకు ఇచ్చే గౌరవం ఇదేనా అని మేయర్‌ను నిలదీశారు. ముఖ్యమంత్రి సభ వద్ద ఏర్పాటు చేసిన విఐపిల గ్యాలరీలలోకి తమను వెళ్లకుండా పోలీసులు అడుగడుగున అడ్డుతగిలి తీవ్ర స్థాయిలో అవమానించారని, కూర్చునేందుకు కుర్చీలు కూడా లేక పోవడంతో గంటల తరబడి నిలబడే ఉన్నామని వాపోయారు. ఈ విషయంమీద వివరణ ఇవ్వాలని మేయర్ కమిషనర్‌ను కోరారు. స్పందించిన కమిషనర్ జస్వంతరావు మాట్లాడుతూ ఉద్దేశపూర్వకంగా తాము ఎవరిని తక్కువగా చూడలేదన్నారు. కార్పొరేటర్లకు డ్యూటీ పాస్‌లు ఎవరు మంజూరు చేశారో తమకు తెలియదన్నారు. సిఎం సభ వద్ద మున్సిపల్ ఉద్యోగుల విధుల కోసం కొన్ని డ్యూటీ పాస్‌లు ఆర్డీఓ నుంచి తెప్పించామని, ఆ పాస్‌లే కార్పొరేటర్లకు కూడా ఇచ్చి ఉంటారని చెప్పారు. ఇలాంటి పొరబాటు మరోసారి జరగకుండా చూసుకుంటామని వివరణ ఇచ్చారు.

సిఎం పర్యటనలో తనకు అవమానం జరిగిందని, ఇందుకు నిరసనగా తాను కౌన్సిల్ సమావేశాన్ని బహిష్కరిస్తున్నానని, అధికార పార్టీ కార్పొరేటర్ బెంగుళూరు నరసయ్య సమావేశం నుంచి వెళ్లిపోయారు. మరో కార్పొరేటర్ శ్రీరాం నాగభూషణం మేయర్ పోడియం వద్ద కింద కూర్చొని నిరసన తెలిపారు. తమకు కూడా డ్యూటీ పాస్‌లే ఇచ్చారని డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు చెప్పడంతో, తమకు అసలు ఆపాస్‌లు కూడా ఇవ్వలేదని ప్రతిపక్ష కార్పొరేటర్ దాచర్ల రమణయ్య తెలిపారు. కౌన్సిల్ అత్యవసర సమావేశం మధ్యాహ్నం 3గంటలకు జరగాల్సి ఉండగా, కోరం లేని కారణంగా సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభమైంది.

రేపు ఆసరా చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-కొనకనమిట్ల

ఈ నెల 26వ తేదీన ఆసరా నాలుగో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం స్థానిక కల్యాణ మండపంలో జరుగుతుందని ఇందిరా క్రాంతి పథం ఏపిఎం కర్నాటి గోపాలకృష్ణారెడ్డి శనివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గిద్దలూరు శాసనసభ్యులు, మార్కాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి అన్నా రాంబాబు, మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి, కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డి హాజరవుతారని తెలిపారు. ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ, జడ్‌పిటిసి ఏడుకొండలు, మోరా శంకర్‌రెడ్డి, ఎంపిటిసిలు, సర్పంచులు హాజరు కావాలని ఏపిఎం గోపాల్ కోరారు.

28న అవగాహన సదస్సు

ప్రజాశక్తి-పుల్లలచెరువు: పుల్లలచెరువులో ఈ నెల 28న వరికపూడిసెల ప్రాజెక్ట్ సాధన సమితి ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ ఆవశ్యకతపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు పల్నాడు జిల్లా సిపిఎం నాయకులు హనుమంతరెడ్డి, ప్రాజెక్ట్ సాధన సమితి నాయకులు జాన్, పుల్లలచెరువు సిపిఎం నాయకులు బొజ్జా వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రజలు, రైతులు విరివిగా పాల్గొని సదస్సును జయప్రదం చేయాలని కోరారు.

ప్రత్యామ్నాయ పంటలతో లబ్ధి: ఎంపిడిఒ

ప్రజాశక్తి-పొదిలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకం ద్వారా సన్న చిన్న కారు రైతులు ప్రత్యామ్నాయ పంటలను సాగుచేసుకుని లబ్ధి పొందాలని గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రోగ్రాం అధికారి, మర్రిపూడి ఎంపీడీఓ ఎన్ సుదీప అన్నారు. శనివారం మండలంలోని ఉపాధి హామీ పథకం మండల అడిషనల్ ప్రోగ్రాం ఆఫీసర్ జి రాంబాబుతో కలిసి మర్రిపూడి గ్రామపంచాయతీ పరిధిలోని గంగపాలెం గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పండ్ల తోటలను పరిశీలించారు. గ్రామంలోని మహిళా రైతులు అంకెపల్లి సుబ్బులు, బాల కోటమ్మ, యువ రైతు వనిపెంట బాలకోటయ్య, సుశీల, రైతులు పండిస్తున్న పండ్ల తోటలను పరిశీలించి వారితో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా ఐదు ఎకరాల లోపు భూమి ఉన్న సన్న, చిన్న కారు రైతులకు అదనపు ఆదాయం కల్పించే ప్రయత్నంలో భాగంగా ఇలాంటి పండ్ల తోటలకు అవకాశం ఇస్తున్నారని, రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ పండ్ల తోటలతో పాటు వాటిలో అంతర్గత పంటలు కూడా వేసుకొని ఇంకా కొంత అదనపు ఆదాయాన్ని పొందవచ్చునని సూచించారు. మొక్కలను జాగ్రత్తగా సంరక్షించుకుంటే ప్రతి నెల సంరక్షణ, వాటర్ బిల్లులు చెల్లిస్తామని రైతులకు తెలిపారు.



పండ్లతోటను పరిశీలిస్తున్న ఎంపిడిఓ సుదీప, ఏపిఓ రాంబాబు

నేడు 'అన్నా'కు సన్మానం

ప్రజాశక్తి-పొదిలి: గిద్దలూరు శాసనసభ్యులు అన్నా వెంకట రాంబాబుకు ఆదివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సన్మానం జరగనున్నట్లు స్థానిక సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గునుపూడి చెంచు సుబ్బారావు (జి.సి), వేమా కృష్ణమూర్తి, కోశాధికారి కంకణాల రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. రాబోయే ఎన్నికల్లో మార్కాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా వైసిపి తరపున రాంబాబు పోటీ చేయనున్న నేపథ్యంలో ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు వాసవి కన్యకాపరమేశ్వరీ దేవస్థానంలో జరుగు కార్యక్రమానికి హాజరవుతున్నట్లు తెలిపారు. ఆర్యవైశ్యులతో ఆత్మీయ సమావేశం జరగనున్నట్లు తెలిపారు. పొదిలిలోని అన్ని వ్యాపార సంస్థల యజమానులు, ఆర్యవైశ్యులు, వాసవి భక్తులు, మహిళలు విరివిగా హాజరై జయప్రదం చేయాలని వారు కోరారు.

లక్ష్య సాధనకు ప్రణాళిక అవసరం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం



మాట్లాడుతున్న కళాశాల చైర్మన్ గుండారెడ్డి

విద్యార్థులు జీవితంలో ఏదైనా సాధించాలంటే పక్కా ప్రణాళిక, నిరంతర శ్రమ అవసరమని శ్రీ గౌతమి విద్యా సంస్థల చైర్మన్ కనుమర్ల గుండారెడ్డి అన్నారు. యర్రగొండ పాలెంలో శనివారం గౌతమి జూనియర్ కళాశాల ఫేర్‌వెల్ సభ ఘనంగా నిర్వహించారు. సభకు గౌతమి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ త్రిపురారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కనుమర్ల గుండారెడ్డి మాట్లాడుతూ ఒక్కొక్కరిలో ఒక్కో టాలెంట్ ఉంటుందని, దాన్ని తెలుసుకోగలిగితే ఆయా రంగాల్లో మీరే గొప్ప వ్యక్తులు కావచ్చని అన్నారు. ప్రతి విద్యార్థి కళాశాలలో నేర్పిన క్రమశిక్షణతో జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. సమయం వృథా చేయకుండా విద్యార్థులు చక్కగా చదివి మంచి మార్కులు తీసుకొచ్చి తల్లిదండ్రులకు, విద్య నేర్పిన గురువులకు, కళాశాలకు పేరు తీసుకురావాలని చెప్పారు. ఎంఈవో పి ఆంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యాభ్యాసాన్ని కొనసాగించాలని అన్నారు. జీవితం చాలా చిన్నదని, ప్రతి అడుగు జాగ్రత్తగా వేస్తూ ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని అన్నారు. ఇంకా ఎంఈవో-2 మల్లు నాయక్, శ్రీ గౌతమి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రవిబాబు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, జడ్పి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పిచ్చిరావు, వీరభద్రాపురం జడ్పి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మంత్రు నాయక్, ముస్లిం యూత్ సొసైటీ అధ్యక్షుడు షేక్ ఇస్మాయిల్, వికాస్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్లా, సీనియర్ విలేకరి షేక్ వలీసాహెబ్ మాట్లాడారు. అనంతరం అతిథులను ఘనంగా సన్మానించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గౌతమి కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

గిద్దలూరు డివిజన్ పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం ఎన్నికలు శనివారం గిద్దలూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగాయి. ఈ ఎన్నికల్లో గిద్దలూరు, కొమరోలు, రాచర్ల మండలాల పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు. ఎన్నికల అధికారిగా మల్లికార్జునరావు, పరిశీలకులుగా పి రామిరెడ్డి వ్యవహరించారు. ఏపీ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం గిద్దలూరు సమితి అధ్యక్షులుగా ఓవీకే శ్రీనివాస్‌కుమార్, ఉపాధ్యక్షులుగా బి శివకుమార్, కార్యదర్శిగా ఈదులు రామకృష్ణారెడ్డి, ట్రెజరర్‌గా బిఎ అశోక్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఏ సుదర్శన్, జిల్లా కౌన్సిలర్లుగా ఎన్ వెంకట్రామిరెడ్డి, ఐఎస్ తీర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు కె విద్యాసాగర్‌రెడ్డి నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన కమిటీ సభ్యులకు పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగులు అభినందనలు తెలియజేశారు.

విజయకుమార్ ఎంపిక పట్ల హర్షం

ప్రజాశక్తి-సంతనూతలపాడు

సంతనూతలపాడు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా బిఎన్ విజయకుమార్‌ను తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడు శనివారం ఎంపిక చేసిన సందర్భంగా మండల టీడీపీ అభినందనలు తెలిపారు. అభినందనలు తెలియజేసిన వారిలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు, బాపట్ల పార్లమెంట్ టీఎన్‌టియుసి ఆర్గనైజింగ్ సెక్రటరీ పావులూరి నారాయణస్వామిచౌదరి, మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు నార్నె మాధవీలత తదితరులు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో పరిశీలన

ప్రజాశక్తి-త్రిపురాంతకం

త్రిపురాంతకంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను శనివారం తహశీల్దారు రామకృష్ణ శివప్రసాద్ పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఆయన వెంట ఎస్ఐ సాంబశివయ్య, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించాలి: కుందురు

ప్రజాశక్తి-గిద్దలూరు



సీఎం జగన్‌ను కలిసిన నాగార్జునరెడ్డి (ఫైల్)

ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఒంగోలుకు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని వైసిపి గిద్దలూరు సమన్వయకర్త కుందురు నాగార్జునరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పూల బొకేతో స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం ఆయన సీఎం జగన్‌తో గిద్దలూరులో సగిలేరు వాగు సమస్య, ఇంకా నియోజకవర్గంలోని పలు సమస్యల గురించి చర్చించి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరారు. స్పందించిన సీఎం జగన్ గిద్దలూరు నియోజకవర్గ అభివృద్ధికి తప్పక సహకరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నాగార్జునరెడ్డిని కుశల ప్రశ్నలు వేశారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ గిద్దలూరులో గెలుపు మనదే అని గట్టి భరోసానిచ్చారు.

ముండ్లపాడుకు ఇంటర్ కాలేజీ మంజూరు

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

మండలంలోని ముండ్లపాడు గ్రామానికి జూనియర్ కాలేజీ మంజూరయింది. రాబోయే 2024 విద్యా సంవత్సరంలో ఈ కాలేజీ ప్రారంభం కానుంది. ఇంటర్మీడియట్ కాలేజ్ రావటంతో విద్యార్థులు, ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ముండ్లపాడు గ్రామానికి ఇంటర్మీడియట్ కాలేజీ రావటం కోసం కృషి చేసిన ముండ్లపాడు గవర్నమెట్ హైస్కూలు మాజీ హెడ్మాస్టర్ వారణాసి గిరిధర్ శర్మకు గ్రామప్రజలు కృతజ్ఞతలు, అభినందనలు తెలియజేశారు.

గరికపాటి ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-దర్శి

జనసేన దర్శి నియోజకవర్గ నాయకులు గరికపాటి వెంకట్ పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దర్శిలోని బంగారమ్మ గుడి వద్ద జరిగిన లక్ష్మీతిరుపతమ్మ గోపయ్య కళ్యాణ మహోత్సవంలో పాల్గొని అమ్మవారి ఆశీర్వాదం తీసుకున్నారు. అంతకముందు నూజెండ్ల మండలం రవ్వవరం గ్రామంలో కొండ గురువయ్యస్వామి తిరునాళ్ల సందర్భంగా స్వామిని దర్శించుకున్నారు. అక్కడే కమ్మ అన్నదాన సత్రంలో అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్మార్ట్ వాచ్‌లు బహూకరణ

ప్రజాశక్తి-పిసిపల్లి

మండలంలోని నేరేడుపల్లి ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 75 మంది విద్యార్థులకు నేరేడుపల్లి గ్రామానికి చెందిన స్వర్ణ యానాది, స్వర్ణ నాగరత్నమ్మల కుమారుడు స్వర్ణ అశోక్ సహాయంతో స్మార్ట్ వాచ్‌లను పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయురాలు టి అంజనీదేవి సమక్షంలో వీటిని విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పావని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంచినీటి ట్యాంకర్లు ప్రారంభం

ప్రజాశక్తి-దొనకొండ: దొనకొండ మండలంలో తాగునీటి సమస్యను పరిష్కరించేలా మండల టీడీపీ నాయకుడు వీరపనేని వెంకన్నచౌదరి ఏర్పాటు చేసిన ఉచిత మంచినీటి ట్యాంకర్లను జనసేన దర్శి నియోజకవర్గ నాయకుడు గరికపాటి వెంకట్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామాల్లో ప్రజలు నీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతుండటం గుర్తించి ఉచితంగా ట్యాంకర్లు ఏర్పాటుచేసి ఉచితంగా నీటి సరఫరా చేసేందుకు ముందుకు వచ్చిన వెంకన్నచౌదరిని అభినందించారు. ఏ గ్రామంలో నీటి సమస్య ఉన్నా, ఏదైనా కార్యక్రమాలకు టాంకర్ల ద్వారా ఉచితంగా నీటిని అందిస్తామని, ప్రజలు నీటి ప్రాముఖ్యతను గుర్తించి సద్వినియోగం చేసుకోవాలని వెంకన్నచౌదరి కోరారు. టీడీపీ నాయకులు పులిమి రమణాయాదవ్, షేక్ సుభాని, కె చెంచయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పరీక్ష అట్టలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పరీక్ష సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్ద దోర్నాలలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థినులకు శనివారం విజయ్ సోషల్ సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పరీక్ష అట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ సంద్రపాటి విజయ్‌కుమార్, మోడల్ స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ పల్లెబోయిన లాలయ్య, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం ప్రిన్సిపల్ ఎల్ శిరీష, గుంటు ఫీబే, ఎనిబెర జోహార్ బాబు, చాట్ల గంగయ్య తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి

నిశ్చయ తాంబులాల వేడుకలో డాక్టర్ ఉగ్ర

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

హనుమంతునిపాడు మండల తెలుగు రైతు అధ్యక్షులు కందుల వెంకట సుబ్బారెడ్డి మనుమరాలు మారంరెడ్డి దివ్య నిశ్చయ తాంబూలాల వేడుక కనిగిరిలోని బ్రాహ్మణ కల్యాణ మండపంలో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కనిగిరి మాజీ శాసనసభ్యులు తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పాల్గొని ఒక్కటి కాబోతున్న జంటను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి గాయం తిరుపతిరెడ్డి, సర్పంచి సానికొమ్ము బ్రహ్మారెడ్డి, చీకటి వెంకటసుబ్బయ్య, భూసి రామకోటిరెడ్డి, కోటపాటి రమేష్‌రెడ్డి, పెంచికల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

2న జిల్లా సదస్సు

ప్రజాశక్తి-పిసిపల్లి

మందకృష్ణ మాదిగ ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి జిల్లాల పర్యటనలో భాగంగా మార్చి 2వ తేదీ అద్దంకిలో జరుగు ఉమ్మడి ప్రకాశం జిల్లా సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ కనిగిరి నియోజకవర్గం పీసీ పల్లి మండలం దివాకర్‌పల్లి గ్రామంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు గోచిపాతల రవిమాదిగ, కనిగిరి నియోజకవర్గం ఎంఎస్‌పి ఇన్‌చార్జి రావినూతల కోటయ్య మాదిగ, ఎంఆర్‌పిఎస్ కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నేలపాటి రాజుమాదిగ, ఎంఆర్‌పిఎస్ పీసీపల్లి మండల ఇన్‌ఛార్జి నందిపాటి సుధీర్ మాదిగ, పిసిపల్లి మండలం ఎంఎస్‌పి ఇన్‌ఛార్జి గంగవరపు రాజేష్ మాదిగ, ఎంఆర్‌పిఎస్ కనిగిరి మండల నాయకులు కేశవరపు ఆదాముమాదిగ, దివాకర్‌పల్లి గ్రామస్తులు పాల్గొన్నారు. మందకష్ణ మాదిగ మన జిల్లాకు వస్తున్న సందర్భంగా కనిగిరి నియోజకవర్గంలో ఉన్న మాదిగలు వేలాదిగా తరలివచ్చి సదస్సును జయప్రదం చేయాలని వారు కోరారు.

బెంగుళూరుకు బస్సు సర్వీసు

ప్రజాశక్తి-త్రిపురాంతకం

త్రిపురాంతకం నుంచి బెంగుళూరు వెళ్లే ప్రయాణికుల కోసం వినుకొండ ఆర్టీసీ డిపో వారు బస్ సౌకర్యం కల్పించారు. నరసరావుపేట నుంచి బయలుదేరి ప్రతిరోజూ సాయంత్రం 6.25కు త్రిపురాంతకం వస్తుంది. కుంట, మార్కాపురం, పోరుమామిళ్ల, కడప, మదనపల్లి మీదుగా రెండోరోజు ఉదయం 6.30కు బెంగుళూరు చేరుతుంది. బస్ రిజర్వేషన్ కావాలనుకునే వారు గ్రంధిశిల సుబ్రమణ్యం 6303058153 నెంబరులో సంప్రదించాలని కోరారు. అలాగే త్రిపురాంతకం నుంచి హైదరాబాదుకు కూడా బస్సు సౌకర్యం కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అరాచక పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాలి

◆ సంతరావూరులో ఎన్‌టిఆర్ విగ్రహావిష్కరణ ◆ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



ఎన్‌టిఆర్ విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

ప్రజాశక్తి - చిన్నగంజాం

తెలుగు జాతి వెలుగు శిఖరం ఎన్‌టిఆర్ అని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, మాజీ మంత్రి నక్కా ఆనందబాబులు పేర్కొన్నారు. మండలంలోని సంతరావూరు గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, మాజీ ఎమ్మెల్యే బిఎన్ విజయ్ కుమార్, టిడిపి బాపట్ల ఇన్చార్జి వేగేసిన నరేంద్రవర్మ, టిడిపి చీరాల ఇన్చార్జ్ ఎంఎం కొండయ్య, జనసేన ఇంచార్జ్ పెద్దపూడి విజయ్ కుమార్, టిడిపి సీనియర్ నేత సలగల రాజశేఖర్ బాబుతో కలిసి విగ్రహాన్ని ఆవిష్కరించారు. తొలుత గ్రామ ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆంజనేయస్వామి దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి భారీ ప్రదర్శనగా ఎన్టీఆర్ విగ్రహం వరకు చేరుకున్నారు. ప్రజలు అడు గడుగున నీరాజనం పలికారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వక్తలు మాట్లాడుతూ పార్టీ పెట్టిన తొమ్మిది నెలల్లోనే అధికారంలోకి తెచ్చి ఎన్‌టిఆర్ చరిత్ర సృష్టించారని అన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని అన్నారు. ప్రజారంజక పాలన సాగించిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అన్నారు. ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించేందుకు అనేక సంస్కరణలు అమలు చేశారని అన్నారు. ప్రజలే దేవుళ్ళు సమాజమే దేవాలయమనే నినాదాన్ని పాటించి ప్రజల కోసం పనిచేసిన వ్యక్తి ఎన్టీఆర్ అన్నారు. రాష్ట్ర భవిష్యత్తు బాగుండాలంటే వైసిపి అరాచక పాలన అంతం కావాలని అన్నారు. భవిష్యత్ తరాలకు బంగారు బాటలు వేయాలంటే టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు. నిస్వార్థ రాజకీయం మాత్రమే రాష్ట్రాన్ని కాపాడుకోగలదని పేర్కొన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం మళ్ళీ ప్రగతి బాట పడుతుందని అన్నారు. రాష్ట్రంలో జనసేన, టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావడం చారిత్రక అవసరం అన్నారు. నిరంకుశ రాజకీయం సాగిస్తున్న జగన్‌కు బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పొద వీరయ్య, మాజీ జెడ్పిటిసి యార్లగడ్డ లక్ష్మి, దేవతోటి నాగరాజు, తెలుగు మహిళా అధ్యక్షురాలు జరుగుల సంధ్య, టిడిపి గ్రామ అధ్యక్షులు ఆతిన సురేష్, విగ్రహ దాత ముద్దన రామకృష్ణ పాల్గొన్నారు.



వర్క్‌షాపుకు హాజరైన విద్యార్థులు

పవర్ బిఐపై వర్క్ షాపు

ప్రజాశక్తి - వేటపాలెం

స్థానిక సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కాలేజీలో పవర్ బిఐ అనే అంశంపై ఒక రోజు వర్క్ షాపును నిర్వహించినట్లు కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణారావు తెలిపారు. డేటా సైన్స్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో బిటెక్ 2వ సంవత్సరం విద్యార్థులకు పవర్ బిఐపై వర్క్‌షాపులో విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు ప్రిన్సిపాల్ మొయిద వేణుగోపాలరావు తెలిపారు. హైదరాబాద్ సైంట్ ప్రవేట్ లిమిటెడ్ కంపెనీ సైంటిస్ట్ పివి యస్రావణి వివరించారని డేటా సైన్స్ హెచ్ఒడి కె సుబ్బారావు తెలిపారు. డేటా విశ్లేషణ ఎలా చేయాలో తెలిపారు. దానిలో వివిద పద్ధతులు, డేటా ఆధారంగా డాష్ బోర్డులు ఎలా రూపొందించవచ్చో తెలిపారు. ఈ విభాగంలో నైపుణ్యత సాధించిన వారికి అధిక వేతనంతో కూడిన అనేక ఉద్యోగ అవకాశాలను కల్పించనున్నట్లు తెలిపారు.



ఆర్థిక సహాయం అందజేస్తున్న హనిమిరెడ్డి

హనిమిరెడ్డి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని పుట్టావారిపాలెం అడ్డ రోడ్డు జంక్షన్లో శుక్రవారం గుండె పోటుతో మృతి చెందిన ఓర్సు హనుమంతరావు (35) కుటుంబాన్ని శనివారం వైసిపి ఇంచార్జి పానెం చిన్న హనిమిరెడ్డి పరామర్శించారు. ఆ కుటుంబానికి సానుభూతి తెలిపారు. హనుమంతరావు భార్య అంజమ్మ, పిల్లలను ఓదార్చారు. అనంతరం వారికి ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ఎఎంసి వైస్ చైర్మన్ విప్పల ముసలారెడ్డి, వైసిపి నాయకులు గుర్రం ఏడుకొండలు, నాలి రామారావు, అద్దంకి కొండలు పాల్గొన్నారు.



సభా స్థలాన్ని పరిశీలిస్తున్న విజయసాయిరెడ్డి

సిద్ధం సభ స్థల పరిశీలన

ప్రజాశక్తి - మేదరమెట్ల

మార్చి 3న జరగనున్న సిద్ధం మహా సభ ప్రదేశాన్ని రాజ్యసభ సభ్యులు, రీజనల్ కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డి శనివారం పరిశీలించారు. కొరిసపాడు మండలం పిచ్చుకల గుడిపాడు ప్రాంతంలో సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సిద్ధం మహాసభను జరపనున్నారు. సభా ప్రాంతాన్ని పరిశీలించి సూచనలను చేశారు. ఈ సభ చరిత్రలో నిలిచిపోయే విధంగా జరపాలని సూచించారు. అద్దంకి వైసిపి ఇంచార్జ్ పి హనుమరెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో సిద్ధం మహాసభ జరపటానికి సీఎం జగన్మోహన్‌రెడ్డి స్పష్టం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. శక్తి వంచన లేకుండా సభ విజయవంతం చేయడానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు.

పాలినామ్ మృతికి సంతాపం

ప్రజాశక్తి - పర్చూరు

సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ఫాలినామ్ మృతికి బార్ సోసియేషన్ న్యాయవాదులు సంతాపం ప్రకటించారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కొల్లా నరేంద్ర కుమార్, రావి శ్రీనివాసరావు, సభ్యులు రావి సత్యనారాయణ, పోతిన సురేంద్ర, మేకల రవీంద్రనాద్‌రెడ్డి, చాగంటి సుబ్బారావు, ఒగ్గిశెట్టి గోవిందరాజులు, తులసి రాజేష్ పాల్గొన్నారు.

నీటి కోసం ఎదురు చూపు



పైపుతో మొక్కల మొదళ్లలో నీరు పెడుతున్న రైతన్న

ప్రజాశక్తి - పర్చూరు

రైతులు సాగునీటి కోసం ఎదురు చూస్తున్నారు. కాలువల్లో నీళ్ల లేకపోవడంతో పొగాకు పంటను కాపాడుకునేందుకు వైట్‌బర్లీ రైతులు అవస్థలు పడుతున్నారు. వైట్ బర్లీ పొగాకు సాగు చేసిన రైతులు బెట్ట పరిస్థితులను అధిగ మించేందుకు నానా తండాలు పడుతున్నారు. డిసెంబర్ మొదటి వారంలో వచ్చిన మిచాంగ్ తుఫానుకు దెబ్బ తినడంతో మళ్లీ మొక్కలు నాటారు. కొన్నిచోట్ల ఇప్పటికీ మొక్కలు నాటుతూనే ఉన్నారు. నాటిన కొద్ది రోజులకే బెట్ట పరిస్థితి ఏర్పడింది. దీనివల్ల పైరు ఎదుగుదలపై ప్రభావం చూపుతుంది. ఆరుతడి నీరు పెడితే మొక్కలు వడబడిపోయే ప్రమాదం ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని మొక్కల పాదుల వద్ద నీరు పెట్టటం, తుంపర సేద్యం ద్వారా నీరు అందించడం వంటి విధానాలు చేస్తున్నారు. ప్రస్తుతం పైరు ఎదుగుదల లేకపోతే దిగుబడిపై దీని ప్రభావం ఎక్కువగా ఉంటుంది. అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను ఉపయోగించు కునేందుకు రైతన్నలు శ్రమకోరుస్తున్నారు. జిల్లాలో పర్చూరు ప్రాంతంలోనే అత్యధికంగా వైట్‌బర్లీ సాగు చేస్తున్నారు. పర్చూరు వ్యవసాయ సబ్ డివిజన్లో సాధారణ సాగు విస్తీర్ణం 100827 కాగా ఇప్పటివరకు 22వేల ఎకరాలు సాగుచేసినట్లు వ్యవసాయ శాఖ అంచనా వేశారు. మండలంలో 13700ఎకరాలు సాగు చేయటం గమనించవలసిన విషయం. నియోజకవర్గంలో 30వేల ఎకరాల్లో వైట్ బర్లీ సాగు చేసినట్లు ప్రాథమిక అంచనా వేస్తున్నారు. గత సంవత్సరంతో పోలిస్తే సాగు విస్తీర్ణం రెట్టింపు కన్నా ఎక్కువగా పెరిగింది. మార్కెట్లో వైట్ బర్లి పొగాకు అధిక ధర ఉండటంతో పొగాకు సాగుకు మొగ్గు చూపుతున్నారు. తుఫాను దెబ్బతిన్న పైరు నుంచి తీసివేసిన పొగాకును ప్రస్తుతం క్వింటాలు ధర రూ.10వేల నుంచి రూ.14వేల వరకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. నాణ్యమైన పొగాకు అధిక ధర పలికే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఇంకా వైట్ బర్లి మొక్కలు కొన్ని గ్రామాల్లో నాటుతూనే ఉన్నారు. డ్యాముల్లో నీరు లేనందున ఆరుతడి భయం వెంటాడుతుంది. ఏదో ఒక సమయంలో కొద్దిపాటి వర్షం పడకపోతుందా అనే ఆశతో సాగు చేస్తున్నారు. ఎక్కడెక్కడ కుంటలో నీరు సైతం కిలోమీటర్ల పొడువులో పైపులు వేసి ఇంజన్లతో నీరు పెట్టేస్తున్నారు. ఆ కుంటలు సైతం ఎండిపోతున్నాయి. వరుణుని కరుణ కోసం రైతులు ఆశతో ఎదురుచూపులు చూస్తున్నారు.



టిడిపి పథకాలు ప్రచారం చేస్తున్న అనగాని శివప్రసాద్

టిడిపి పథకాలపై ప్రచారం

ప్రజాశక్తి - రేపల్లె

చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని ప్రజలందరూ కోరుకుంటున్నారని టిడిపి నాయకులు అనగాని శివప్రసాద్ అన్నారు. బాబు షఉరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం మండలంలోని ముత్యుంజయపాలెంలో శనివారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి టిడిపి సూపర్ సిక్స్ పథకాలు, మినీ మేనిఫెస్టో కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో రేపల్లె రామాంజనేయులు, గుర్రం మురహరి, చిప్పల పార్థసారధి, బాలాజీ, నాగరాజు, పిచ్చయ్య, రవీంద్ర, కమతం శివ పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - చీరాల



అంబేద్కర్ విగ్రహావిష్కరణలో దగ్గుమళ్ల

అట్టడుగు వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన ప్రపంచ మేధావి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదర్శాలతో యువత ముందుకు సాగించాలని మాజీ ఐఆర్ఎస్, టిడిపి నాయకులు దగ్గుమళ్ళ ప్రసాద్ అన్నారు. ఇంకొల్లు మండలం వంకాయలపాడులో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ యూత్, సంఘ పెద్దల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని శనివారం ఆవిష్కరించారు. అంబేద్కర్ విగ్రహం దాత మాజీ ఐఆర్ఎస్ కంచర్ల హరిప్రసాదరావు, నాయకులు దేవతోటి సుందరయ్య, విసికె పార్టీ స్టేట్ ప్రెసిడెంట్ విద్యాసాగర్ పాల్గొన్నారు.

చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు జరపాలి



చేనేత సమావేశంలో శ్యామ్ సుందరి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ప్రభుత్వం చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించి, బోర్డుని ఏర్పాటు చేసి సొసైటీలో జరిగే కార్యకలాపాలకు ఇబ్బంది లేకుండా చూడాలని, తద్వారా కార్మికుల ఉపాధి కల్పించాలని దస్కర్ ఆంధ్ర మార్కెటింగ్ అసోసియేషన్ ప్రతినిధి బి శ్యామ్ సుందరి డిమాండ్ చేశారు. స్థానిక రైలుపేట చేనేత సహకార సంఘంలో సహకార సంఘాల భవిష్యత్తు అనే అంశంపై శనివారం సమావేశం నిర్వహించారు. సొసైటీ మేనేజరు బట్టు రాము అధ్యక్షత వహించారు. శ్యాం సుందరి మాట్లాడు తూ ఈపాటికే చేనేత రంగం కార్మికులకు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి పాలకవర్గం సమయం ముగిసి పోయినప్పటికీ పాలకవర్గాన్ని ఏర్పాటు చేయకుండా ప్రత్యేక అధికారుల పాలనలో ఇప్పటివరకు నెట్టుకొచ్చిం దని అన్నారు. దానిని కూడా వదిలేసి నేడు ఎలాంటి బోర్డు, ప్రత్యేక అధికారి లేకపోవడంతో సొసైటీ ద్వారా జరగవలసిన లావాదేవీలు నిలిచిపోయాయని అన్నారు. దీని కారణంగా కార్మికులకు సహకార సంఘాలు ఉపాధి కల్పించలేక పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సొసైటీలోని నిల్వలను ఆప్కో ద్వారా కొనుగోలు చేయాలని కోరారు. సబ్సిడీ, రిబేటు బకాయిలను వెంటనే విడుదల చేయాలని అన్నారు. అక్కడక్కడ ఉన్న భోగస్ సంఘాలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ధస్కర్ ఆంధ్ర అసోసియేషన్ ప్రతినిధి జి రవీంద్ర, ఆంధ్ర ప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జి బాలాజీ, ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు మురుగుడు సత్యనారాయణ, సొసైటీ మాజీ అధ్యక్షులు బట్టు సుబ్బారావు, పడవల మల్లికార్జునరావు పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బలరాం

అభివృద్ధి పనులు పరిశీలన

ప్రజాశక్తి - చీరాల

వేటపాలెం మండలం కొత్తపేటలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే కరణం బాలరామకృష్ణమూర్తి శనివారం పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలతో పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. రోడ్లు, పంచాయితీరాజ్ అతిథి గృహంలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. పనుల నిర్వహణకు సూచనలు చేశారు. ఆయన వెంట పంచాయితీ రాజ్ డిఈ శేషయ్య, వైస్ చైర్మన్ బొనిగల జైసన్ బాబు, పాలపర్తి నాగేశ్వరరావు, సెక్రటరీ బి రమేష్ పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటాం : గొట్టిపాటి

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని పుట్టావారిపాలెం అడ్డ రోడ్డు జంక్షన్‌లో గత శుక్రవారం గుండెపోటుతో మృతి చెందిన ఓర్సు హనుమంతరావు కుటుంబాన్ని ఎమ్మెల్యే గొట్టిపాటి రవి కుమార్ శనివారం పరామర్శించారు. వారి కుటుంబానికి సానుభూతి తెలిపారు. అతని భార్య అంజమ్మ, పిల్లలను ఓదార్చారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అనంతరం వారికి ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచి గురువు యాదవ్, మాజీ ఎంపీపీ సన్నెబోయిన ఏడుకొండలు, వాసురెడ్డి, ధూపాటి ఏసోబు, మాదాల సుబ్బారావు, బండారు పుల్లారావు, కుంచాల ఆదినారాయణ, తేలప్రోలు రమేష్ పాల్గొన్నారు.

పదవులతో బుజ్జగింపులు

జడ్‌పి చైర్మన్‌గా 'వెన్నా'కు అవకాశం

ప్రజాశక్తి-మార్కాపురం

ఎన్నికల వేళ వైసిపి అధిష్టానం బుజ్జగింపుల దారి ఎంచుకుంది. ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్న ఆశావహులను ఏదో ఒక పదవిలో కూర్చోబెట్టి సంతృప్తిపరిచేలా వ్యవహరిస్తోంది. మార్కాపురం నియోజకవర్గంలోనూ అదే జరుగుతోంది. మార్కాపురం నియోజకవర్గ వైసిపిలో ఎమ్మెల్యే టిక్కెట్ ఆశావహులు ఎక్కువగానే ఉన్నారు. ఇక్కడ సీటు మాత్రం గిద్దలూరు సిట్టింగ్ ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబుకు కేటాయించారు. ఇక్కడి సిట్టింగ్ ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డిని గిద్దలూరుకు పంపారు. వైసిపి జిల్లా అధ్యక్షులుగా కొనసాగుతున్న మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి ప్రస్తుతం జరుగనున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేయాలనుకున్నారు. టిక్కెట్ లేదని తెలిసిన తరువాత జంకె వెంకటరెడ్డి గుంభనంగా ఉన్నారు. సిఎం జగన్ వెంట నమ్మకంతో నడిచిన జంకె అలక తీర్చేందుకు ఎపిఐఐసి చైర్మన్‌గా అవకాశం కల్పించారు. మార్కాపురం నియోజక వర్గంలో వైసిపి అభ్యర్థిగా నిలవబోతున్న అన్నా వెంకట రాంబాబు గెలుపు బాధ్యత కూడా జంకెపై ఉంచారు. వైసిపిలో ఆది నుంచీ వెన్నా హనుమారెడ్డి కొనసాగుతున్నారు. వైసిపి రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కాలుష్య నియంత్రణ మండలి సభ్యులుగా పని చేస్తున్నారు. వైసిపి ఆవిర్భావంలో జెండా కట్టిన వారిలో వెన్నా హనుమారెడ్డి అని చెప్పాలి. విహెచ్ఆర్ విద్యా సంస్థల స్థాపనతో అందరికీ


సిఎం జగన్‌తో వెన్నా దంపతులు (ఫైల్)

సుపరిచితులయ్యారు. 2014లో, 2019లో వైసిపి తరపున మార్కాపురం నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని తీవ్ర ప్రయత్నాలు చేశారు. ఇక్కడి బలాబలాల నేపథ్యంలో 2014లో జంకె వెంకటరెడ్డికి, 2019లో కుందురు నాగార్జున రెడ్డిలకు వైసిపి అవకాశం కల్పించగా భారీ మెజార్టీలతో వారిద్దరూ విజయం సాధించారు. వెన్నా హనుమారెడ్డి మాత్రం నిరాశకు లోనయ్యారు. మరోసారి అవకాశం రాకపోతుందా అని వెన్నా హనుమారెడ్డి వైసిపిలో కొనసాగారు. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి అనుచరుడిగా హనుమారెడ్డి ఉన్నారు. ఎమ్మెల్యే టికెట్ ఆశించినా అవకాశం దక్కకపోవడంతో గడిచిన జిల్లా పరిషత్ ఎన్నికల్లో హనుమారెడ్డి సతీమణి వెన్నా ఇందిరకు తర్లుపాడు మండలం నుంచి జడ్‌పిటిసిగా అవకాశం కల్పించారు. ప్రస్తుతం వెన్నా ఇందిర తర్లుపాడు జడ్‌పిటిసిగా కొనసాగుతున్నారు. జడ్‌పి చైర్మన్‌గా వెన్నా ఇందిర అప్పట్లో ఆశించినా ఫలితం లేకపోయింది. ఆది నుంచీ వైసిపిలో కొనసాగుతున్న వెన్నా హనుమారెడ్డి కుటుంబానికి న్యాయం చేయాలని బాలినేని శ్రీనివాసరెడ్డి ఆ పార్టీ పెద్దల వద్ద పదేపదే కోరినట్లు తెలిసింది. ప్రస్తుత ఎన్నికల్లో వెన్నా హనుమారెడ్డిని సంతృప్తి పరిచేలా జడ్‌పి చైర్మన్‌గా అవకాశం కల్పించాలని వైసిపి అధిష్టానం భావించినట్లు తెలిసింది. ఆ పదవిలో ప్రస్తుతం బూచేపల్లి వెంకాయమ్మ కొనసాగుతున్నారు. ఆమె కుమారుడు బూచేపల్లి శివప్రసాదరెడ్డి దర్శి నియోజకవర్గం నుంచి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయబోతున్నారు. ఈ నేపథ్యంలో బూచేపల్లి వెంకాయమ్మ స్థానంలో వెన్నా ఇందిరకు అవకాశం కల్పిస్తే పశ్చిమ ప్రకాశానికి తొలిసారిగా జడ్‌పి చైర్మన్‌గా అవకాశం కల్పించినట్లు ఉంటుదని వైసిపి భావిస్తోంది. ఈ పదవితో వెన్నా హనుమారెడ్డికి న్యాయం చేసినట్లుగా ఉంటుందని పార్టీ పెద్దలు భావించినట్లు తెలిసింది. ఈ నెల 23న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ఒంగోలు వచ్చిన సందర్భంగా జడ్‌పి చైర్మన్ అంశం చర్చకు వచ్చినట్లు తెలిసింది. వెన్నా ఇందిరకు జడ్‌పి చైర్మన్‌గా అవకాశం కల్పించేందుకు గ్రీన్ సిగ్నల్ లభించినట్లు సమాచారం. నోటిఫికేషన్ ముందే ఈ ప్రక్రియ జరుగుతుందని వెన్నా వర్గీయులు భావిస్తున్నారు. ఈ రకంగా వైసిపిలో అసంతృప్తుల అలక తీర్చి పదవుల పందేరం సాగిస్తున్నారన్న చర్చ సాగుతోంది.

వికలాంగులకు అండగా నిలుస్తా

ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం నియోజకవర్గంలోని వికలాంగులకు, వారి కుటుంబాలకు అండగా నిలుస్తానని వైసిపి మార్కాపురం నియోజకవర్గ సమన్వయకర్త, గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు అన్నారు. వచ్చే ఎన్నికల్లో మార్కాపురం నుంచి వైసిపి అభ్యర్థిగా అన్నా వెంకటరాంబాబు పోటీ చేయనున్నారు. ఈ నేపథ్యంలో వైసిపి దివ్యాంగుల విభాగం తరపు న మార్కాపురం నియోజకవర్గంలోని వికలాంగు ల సంఘం నాయకులు శనివారం అన్నా రాంబాబును కలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో తనను ఆదరించాలని ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు వారిని కోరారు. కార్యక్రమంలో వైసిపి వికలాంగుల సంఘం మార్కాపురం పట్టణ అధ్యక్షుడు నడికట్టు వెంకట రమణారెడ్డి, మార్కాపురం మండల అధ్యక్షులు లుంజల శేఖర్, పట్టణ ఉపాధ్యక్షుడు సయ్యద్


వికలాంగులను అభినందిస్తున్న 'అన్నా'

రహమాన్, ప్రధాన కార్యదర్శి చముడురి సురేంద్ర, కార్యదర్శి విడుదల అశోక్, కోశాధికారి తుంబేటి వెంకట రమణ, మార్కాపురం మండల కార్యదర్శి మహీన్ తదితరులు పాల్గొన్నారు. ఇటవల రోడ్డు ప్రమాదంలో గాయపడి విశ్రాంతి తీసుకుంటున్న వైసిపి వికలాంగుల సఘం జిల్లా అధ్యక్షుడు దొంతిరెడ్డి గోపాల్‌రెడ్డిని ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు ఫోన్‌లో పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ప్రజలందరూ జగనన్న పక్షానే..

వైసిపి కనిగిరి ఇన్‌ఛార్జి దద్దాల నారాయణ యాదవ్

ప్రజాశక్తి-వెలిగండ్ల

కనిగిరి నియోజక వర్గం వెలిగండ్ల మండలం జాల్లపాలెం పంచాయతీ పరిధిలోని ముసిలిపల్లి గ్రామానికి చెందిన కొందరు వారం రోజుల క్రితం టిడిపిలో చేరారు.


కార్యకర్తలను వైసీపీలోకి ఆహ్వానిస్తున్న ఇన్‌ఛార్జి దద్దాల నారాయణ

తిరిగి శుక్రవారం వైసీపీ ఇన్‌ఛార్జి దద్దాల నారాయణయాదవ్ ఆధ్వర్యంలో ఆ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా దద్దాల నారాయణ మాట్లాడుతూ వైసీపీ కార్యకర్తలు ఎలాంటి అపోహలకు లోనుకావద్దని, ప్రతి ఒక్క కార్యకర్తనూ కలుపుకొని పనిచేస్తానని అన్నారు. ఎవరికైనా ఏదైనా అవసరం ఉంటే తనను నేరుగా సంప్రదించాలన్నారు. అంతేగాక జగనన్న సంక్షేమ పథకాలతో ప్రజలందరూ వైసిపి పక్షాన ఉన్నారన్నారు. టిడిపిని వీడి వైసీపీలో 15 కుటుంబాలవారు చేరారు. పార్టీలో చేరినవారిలో కాకర్ల వెంకటయ్య, దిబ్బమడుగు గురవయ్య, పెద్ద గురవయ్య, దిబ్బమడుగు బాలగురవయ్య, గంగయ్య, గురునాథం, మాలకొండయ్య, తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసిల సంఘం జిల్లా అధ్యక్షులు గుంటక తిరుపతిరెడ్డి, జాలపాలెం సర్పంచి కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ ఆదినారాయణరెడ్డి, వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు బియ్యం అందజేత

ప్రజాశక్తి-వెలిగండ్ల

మండలంలోని కంకణంపాడు జనరల్ ప్రాథమిక పాఠశాలకు ఆ గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థులు 17 బస్తాల మసూర బియ్యం బహూకరించారు. వాటిని ఎంఈఓ దాస్ ప్రసాద్, ఎంఈఓ-2 రామిరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయుడు మారం నాగరాజులకు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం కోసం గ్రామస్తులు తమవంతు సహకారం అందిస్తున్నారని, అంతేగాక ఈ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు వారి తల్లిదండ్రుల గుర్తింపుగా పాఠశాలకు సహకారాలు అందించడం అభినందనీయమన్నారు. దాతల సహకారం


బియ్యం బస్తాలు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

మరువలేనిదన్నారు. సహకారం అందించిన పూర్వ విద్యార్థులు ఏరువ సుబ్బారెడ్డి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు, నన్నసాని దేవయ్య జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు, సోము తిరుపతమ్మ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు, బహునాథం శివరామయ్య, నాగమ్మ జ్ఞాపకార్థం వెంకటాచారి, మొహరం పెద నాగయ్య జ్ఞాపకార్థం నాగార్జున, కమలాపురం నవీన్, చిలకల మహేంద్ర, పూర్వ విద్యార్థులు బహూకరించారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

ప్రజాశక్తి-సిఎస్ పురం: మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కొమ్మినేని చిన్నఆదినారాయణ తెలిపారు. దాతల సహకారంతో దేవాలయ ప్రాంగణంలో రెండు బోర్లను వేయించినట్లు తెలిపారు. వీటి ద్వారా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీటిని అందించగలుగుతామన్నారు. ఆలయంలో ఉచితంగా బోర్లు వేయించేందుకు ముందుకు వచ్చిన మండలంలోని పెద్దగోగులపల్లి గ్రామానికి చెందిన మీడియా వెంకట్ నారాయణ, గాయత్రి, జినుగువారిపల్లికి చెందిన జలకర నారాయణ, పద్మ, చేవూరు శ్రీనివాసులు, విజయమ్మ, తోట వెంకటేష్, విజయమ్మలను ఆలయ వ్యవస్థాపక చైర్మన్ తుమ్మినేని ఆదినారాయణ అభినందించారు. కార్యక్రమంలో కొమ్మినేని వెంకట్రావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


దేవస్థానం వద్ద ఉచితంగా బోర్లు వేస్తున్న దాతలు


మోటారును అందజేస్తున్న కవులు

గ్రంథాలయానికి మోటారు బహూకరణ

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి పట్టణంలోని గ్రంథాలయానికి నీటి సౌకర్యం కోసం రూ.6,500 విలువ కలిగిన నీటి మోటారును కనిగిరి కవులు కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి, షేక్ గయాజ్ బాషా, కొండ్రేడ్డి నాగిరెడ్డి, బృంగి సుబ్రహ్మణ్యం, ప్రసాద్‌రెడ్డి, రవికుమార్, అంబటి పోలిరెడ్డి, పాపసాని శ్రీనివాసులురెడ్డి తదితర కవులు బహూకరించారు. ఈ సందర్భంగా కవులు మాట్లాడుతూ గ్రంథాలయ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు. గ్రంథాలయాలను అభివృద్ధి చేసుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. విద్యార్థులు ప్రతిరోజూ గ్రంథాలయాలను సందర్శించి సాహిత్య పుస్తకాలు విరివిగా చదివి తెలుగు భాషపై పట్టు సాధించాలని కోరారు. ఈ సందర్భంగా గ్రంథపాలకులు అహ్మద్ షరీఫ్ మాట్లాడుతూ గ్రంథాలయానికి నీటి సౌకర్యం కోసం నీటి మోటారును కనిగిరి కవులు అడిగిన వెంటనే ఇచ్చినందుకు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.


గృహప్రవేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, ప్రముఖులు

గృహప్రవేశానికి ప్రముఖుల హాజరు

ప్రజాశక్తి-కొనకనమిట్ల

కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డి సోదరుడు, చిన్నారికట్ల మాజీ సర్పంచ్, మండల వైసిపి సీనియర్ నాయకులు ఉడుముల గురవారెడ్డి నూతన గృహప్రవేశానికి ఏపీఐఐసీ చైర్మన్, వైసిపి జిల్లా అధ్యక్షులు జంకె వెంకటరెడ్డి, మార్కాపురం శాసనసభ్యులు కుందురు నాగార్జునరెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు, కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డి శనివారం హాజరై పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మార్కాపురం నియోజకవర్గంలోని పలు మండలాల నుంచి ఎంపీపీ, జడ్‌పిటిసిలు, మండల ఉపాధ్యక్షులు, వైసిపి మండల కన్వీనర్లు, ఎంపిటిసిలు, సర్పంచులు, అధికారులు హాజరయ్యారు.


శివప్రసాదరెడ్డి దంపతులను సన్మానిస్తున్న అభిమానులు

శివప్రసాద్‌రెడ్డి దంపతులకు సన్మానం

ప్రజాశక్తి-దర్శి

దర్శి మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, నందినిల పెండ్లి రోజు సందర్భంగా స్థానిక బూచేపల్లి నివాసంలో అభిమానులు పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అదే విధంగా శివరాజ్‌నగర్‌లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దర్శిలోని బంగారమ్మ గుడి వద్ద జరిగిన లక్ష్మీతిరుపతమ్మ గోపయ్య కళ్యాణ మహోత్సవంలో బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి, నందినిలు పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్‌రెడ్డి ఇసుక దందా

కలెక్టర్లకు కనిపించ లేదా?

◆ కేంద్ర పర్యావరణ శాఖ నివేదికపై ఏం సమాధానం చెబుతారు? ◆ ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి - అద్దంకి

జగన్‌రెడ్డి ఇసుక దందా కలెక్టర్ల కళ్లకు కనిపించడం లేదా? కేంద్ర పర్యావరణ శాఖ నివేదికపై సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఏమి సమాధానం చెబుతారని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అధికారులను ప్రశ్నించారు. కేంద్ర పర్యావరణ శాఖ ఎన్జీటీకి కన్పించిన ఇసుక దోపిడీ రాష్ట్రంలోని కలెక్టర్లకు కన్పించకపోవడం బాధాకరమని అన్నారు. ఇసుక తవ్వకాల్లో పెద్ద ఎత్తున ఉల్లంఘనలు జరుగుతున్నాయని, రాష్ట్ర స్థాయి పర్యావరణ ప్రభావ మదింపు సంస్థ (సియా) గత ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు ఇసుక తవ్వకాలకు కొత్తగా పర్యావరణ అనుమతులు (ఈసీ) జారీ చేయలేదని స్పష్టం చేసినా వైసిపి ఇసుక బకాసురులు అడ్డగోలుగా అక్రమ రవాణా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. భారీ యంత్రాలతో 24 గంటలూ తవ్వేస్తూ ఒక్కో రీచ్ నుంచి వెయ్యి నుంచి 2వేల టన్నుల ఇసుక తరలిస్తున్నారని అన్నారు. చేతిరాతతో వేబిల్లులు ఇస్తున్నారని తెలిపారు. కంప్యూటరైజ్డ్ బిల్లులు లేవని అన్నారు. సీసీ కెమెరాలు లేవని తెలిపారు. రాష్ట్రంలో రీచ్‌ల వివరాలు అడిగితే గనుల శాఖ, రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వలేదని



ఎంఎల్ఎ గొట్టిపాటి రవి

మండిపడ్డారు. వాగులు, వంకలు, నదుల్లో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతున్నా అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరించడం దుర్మార్గమని పేర్కొన్నారు. సాంకేతిక సాయంతో ఎక్కడ ఎన్ని మీటర్ల మేర ఇసుక తవ్వకాలు చేపడుతున్నారనే విషయం తెలిసిపోతుం దని అన్నారు. ఇసుక అక్రమాల్లో దోచుకున్న సొమ్ముతో వచ్చే ఎన్నికల్లో గెలవాలని జగన్మోహన్ రెడ్డి కుట్రలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. జగన్ అవినీతి కి సహకరిస్తున్న వారిపై కూడా తాము తప్పకుండా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నూతన ఇసుక విధానం తీసుకొస్తామని చెప్పిన జగన్ ఆరు నెలల పాటు ఇసుక రవాణా నిలిపివేయడంతో దాదాపు 130మంది భవన నిర్మాణ కార్మికులు బలైపోయారని అన్నారు. వైసీపీ ఇసుక దోపిడీ కారణంగా అన్నమయ్య డ్యామ్ కొట్టుకుపోయి 45మంది జల సమాధి అయ్యారని తెలిపారు. ఇసుక అక్రమ రవాణాను ప్రశ్నించిన వరప్రసాద్‌కు శిరోముండనం చేశారని గుర్తు చేశారు. ఈనాడు విలేకరి పరమేశ్వరరావుపై వైసీపీ గుండాలు దాడి చేసి గాయపరిచారని అన్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు పరివాహక గ్రామాలైన తమ్మవరం, మణికేశ్వరం, అనమనమూరు గ్రామాల్లో స్థానిక వైసిపి నేతలు ఇష్టారీతిన పగటి పూటే యథేచ్ఛగా ఇసుక తరలిస్తున్నా అధికారులకు కనిపించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తిమ్మాయపాలెం వంతెన పిల్లర్ల సమీపంలో ఇసుకను తోడేస్తుండటంతో దాదాపుగా నాలుగు దశాబ్దాల కాలం నాటి వంతెన కూలిపోయే ప్రమాదం ఉందన్నారు. అధికారులు వారి విధులు, బాధ్యతను విస్మరించడం తగదని హితవు పలికారు. గతంలో అధికార పార్టీ నేతల అవినీతికి బాసటగా నిలిచిన అనేక మంది అధికారులు నేడు జైలుకు వెళ్లారని అన్నారు. రాబోయే రోజుల్లో జగన్ అవినీతికి సహకరించిన ప్రతి అధికారి జైలుకు పోవడం ఖాయమని అన్నారు. వైసీపీ అవినీతి, అరాచక పాలనను సాగనంపేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని తెలిపారు.

మద్యంపై యుద్ధం : జనసేన

ప్రజాశక్తి - రేపల్లె

వైసీపీ ప్రకటించిన సిద్ధం పోస్టర్లపై జనసేన ఆధ్వర్యంలో యుద్ధం ప్రకటించినట్లు జనసేన పట్టణ అధ్యక్షులు రాసంశెట్టి మహేష్ తెలిపారు. స్థానిక సమస్యలను అజెండాగా చేసుకుని వైసీపీపై జనసేన సిద్ధాంత పరమైన యుద్ధం ప్రారంభించినట్లు తెలిపారు. సిద్ధంకి రోజుకో యుద్ధం! పేరున కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అధికారంలోకి రాగానే సంపూర్ణ మద్యపాన నిషేధం చేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చాక ప్రభుత్వం చేతే మద్యం అమ్మించడంపై మండిపడ్డారు. మద్యం అలవాటు ఉన్నవారు ప్రభుత్వం అమ్మే నాణ్యత లేని దిక్కుమాలిన మద్యం త్రాగి అనారోగ్యంతో మరణిస్తున్నారని అన్నారు. ఈ మద్యం తాగడం వల్ల మత్తులో మితిమీరి నేరపూరిత పనులకు పాల్పడుతూ సంఘ విద్రోహ శక్తులుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను అధికారంలోకి వస్తే మద్యాన్ని నిషేధిస్తానని చెప్పిన సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాబోయే 5ఏళ్లలో మద్యంపై వచ్చే ఆదాయాన్ని కూడా హామిగా చూపించి అప్పులు తీసుకురావటం అంటే తాగుబోతులను తాకట్టు పెట్టటమేనని అన్నారు. మాటకి ముందు ఓ సారి మాటకి తరువాత ఓ సారి మాట తప్పును, మడమ తిప్పను అనే జగన్మోహన్



మద్యంపై ధర్నా చేస్తున్న టిడిపి, జనసేన కార్యకర్తలు

రెడ్డి మద్యపాన నిషేధం హామీ విషయంలో ఎందుకు మాటమీద నిలబడలేదని ప్రశ్నించారు. ఇలాంటి మోస పూరిత ప్రభుత్వాన్ని గద్దె దించి జనసేన, టిడిపి ప్రభుత్వాన్ని స్థాపించేందుకు జనం కూడా సిద్ధం అంటున్నారని తెలిపారు. తెలుగు మహిళా నాయకురాలు యలవర్తి లక్ష్మీ మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి మహిళలు నా తోబుట్టువులు అంటూనే తను అమ్మే కల్తీ మద్యం ద్వారా ఎంతో మంది మహిళల తాళిబొట్లు తెంచేశాడని అన్నారు. వాళ్ళ ఉసురు ఊరికే పోదని అన్నారు. రాబోయే ఎన్నికల్లో జగన్‌కు మహిళలే తగిన రీతిలో బుద్ధి చెప్పటానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో జనసేన పట్టణ నాయకులు దేవగిరి శంకర్, ఈపూరి సురేష్, టిడిపి పట్టణ అదక్షులు గోగినేని రామరావు పాల్గొన్నారు.



బిఎల్‌ఒల సమావేశంలో ఆర్‌డిఒ షారోన్

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి - రేపల్లె

ఓటర్ల జాబితా సక్రమంగా రూపొందించటంలో నిర్లక్ష్యం వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎన్నికల అధికారి, ఆర్డీఓ హేల షారోన్ హెచ్చరించారు. పట్టణంలోని వీరవల్లి కోటయ్య ఫంక్షన్ హాల్లో బిఎల్‌ఓలతో సమీక్షా సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటర్ల జాబితాను నిశిత పరిశీలనతో మార్పులు, చేర్పులు చెయ్యాలన్నారు. రాజకీయ పార్టీలతో సంబంధాలు పెట్టుకోవద్దని హెచ్చరించారు. ఎన్నికలకు సంబంధించిన విధులను నిష్పక్షపాతంగా నిర్వహించాలని అన్నారు. ఎన్నికల విధుల్లో పక్షపాతంగా వ్యవహరిస్తే ఉద్యోగాలు పోయే ప్రమాదం ఉందన్నారు. ప్రతి బిఎల్‌ఓ తమకు ఇచ్చిన ఓటర్ జాబితాను పరిశీలించి వీలైనంత వరకు డెత్ కేసులు, ఇతర ప్రాంతాల్లో ఓట్లు ఉండి ఇక్కడ ఉంటే వారి అనుమతితో తొలగించాలని అన్నారు. అనంతరం స్వీప్ యాక్టివిటి అమలు చేస్తున్న తీరుపై బిఎల్‌ఓలను అడిగి తెలుసుకున్నారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు గుర్తించారా? అక్కడ ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో చెప్పాలని కోరారు. 91వ పోలింగ్ స్టేషన్ మోళ్ళగుంట బిఎల్‌ఓ నరేంద్ర బాబును వివరణకోరారు. తనకు ఎటువంటి అవగాహన లేదని సమాధానం చెప్పటంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. 91వ పోలింగ్ స్టేషన్లో గతంలో రెండు కొట్లాట కేసుకు నమోదైనట్లు చెప్పారు. బిఎల్‌ఓ పరిధిలోని ఓట్లలో పురుషులు, స్త్రీలు, ట్రాన్స్ జెండర్ ఎంత మంది ఓటర్లు ఉన్నారనే అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో నగరం, నిజాంపట్నం, రేపల్లె, చెరుకుపల్లి తహశీల్దారులు, సూపర్ వైజర్లు, బిఎల్‌ఓలు పాల్గొన్నారు.

శ్రీ సంజీవని ఆసుపత్రి భవనం ప్రారంభం

ప్రజాశక్తి - చెరుకుపల్లి

డెల్టా ప్రాంతంలో అత్యవసర కేసులు, కీళ్ల వ్యాధులకు పేరుపొందిన శ్రీ సంజీవని మల్టీ స్పెషాలిటీ వైద్యశాల నూతన భవనం శనివారం ప్రారంభించారు. గుల్లపల్లి కోటి సెంటర్లో నూతనంగా ఆసుపత్రి భవనానికి ప్రారంభ పూజ చేశారు. బాపట్ల, గుంటూరు జిల్లాల్లో ప్రసిద్ధి చెందిన కీళ్ల వైద్య నిపుణులు డాక్టర్ కమ్మెల హరీష్, అత్యవసర కేసుల నిపుణులు డాక్టర్ బొలగాని శివరామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆసుపత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ కమ్మెల హరీష్, బోలగాని



డాక్టర్ కమ్మెల హరీష్‌కు సత్కారం

శివరామకృష్ణను ప్రజలు ప్రత్యేకంగా అభినందించారు.

వాలంటీర్ల సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - వేమూరు

స్థానిక మండల పరిషత్ సమావేశ హాలులో వాలంటీర్లకు వందనం సభ శనివారం నిర్వహించారు. వైసీపీ ఇన్చార్జి అశోక్ బాబు సభలో మాట్లాడారు. వాలంటీర్లకు అవార్డులు అందజేశారు. సభకు ఎంపీపీ యలమాటి మోహన్ అధ్యక్షత వహించారు. సభలో అశోక్ బాబు మాట్లాడుతూ వాలంటరీ వ్యవస్థ ద్వారా సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలనను ప్రజలకు చేరువ చేశారని కొనియాడారు. ప్రజలకు వాలంటీర్లు అండగా ఉంటూ ప్రభుత్వం అమలు చేసే ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజలకు చేరవేయడంలో వాలంటీర్ల పాత్ర కీలకమైనదని అన్నారు.



వాలంటీర్లకు వందనం సభలో అశోక్ బాబు

కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ బల్లిమంత ఏడుకొండలు, జడ్పిటిసి గాజుల హేమలత పాల్గొన్నారు.

ఎఎంసి అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి- సంతమాగులూరు

ఎఎంసి అభివృద్ధికి కృషి చేస్తానని నూతన చైర్మన్ కుంచాల సుబ్బాయమ్మ తెలిపారు. మండలంలోని అడ్డరోడ్ జంక్షన్‌లోని ఎఎంసి కార్యాలయంలో నూతన పాలకవర్గ కమిటీ తొలి సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి నిధులను సక్రమంగా వినియోగించి యార్డ్ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. యార్డులో లావాదేవీల వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎఎంసి వైస్ చైర్మన్ విప్పల ముసలారెడ్డి, కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.



దేవులపల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కవులు

భావ కవితా పాలవెల్లి దేవులపల్లి

ప్రజాశక్తి - బాపట్ల

దేవులపల్లి కృష్ణశాస్త్రి తెలుగు సాహితీ జగత్తులో భావకవిగా ప్రసిద్ధి చెందారని సాహితి భారతీయ అధ్యక్షులు రావూరి నరసింహ వర్మ అన్నారు. దేవులపల్లి 44వ వర్ధంతి సందర్భంగా దేవులపల్లి చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. సభలో ఆయన మాట్లాడుతూ దేవులపల్లి రచనల్లో కృష్ణపక్షం, ఊర్వశి, అమృత వీణ, మహతి, బహుకాల దర్శనం వంటి కావ్యాలు బహుళ ప్రాచుర్యం పొందాయని అన్నారు. సుమారు 70చలన చిత్రాలకు 170ఆణిముత్యాల వంటి గీతాలు రాశారని అన్నారు. ఆంధ్ర షెల్లిగా ప్రసిద్ధి నొందిన దేవులపల్లి ఘనాఘన సుందర, రావమ్మ మహాలక్ష్మి రావమ్మా, రానిక నీకోసం సఖీ, కుశలమా నీకు కుశలమేనా, నేలతో నీడ అన్నది, మావి చిగురు తినగానే కోయిల కూసేనా, ఆకులో ఆకునై వంటి అద్భుత గీతాలు రచించి తెలుగు సినీ సాహిత్యానికి కావ్య గౌరవాన్ని ప్రసాదించారని అన్నారు. కార్యక్రమంలో మర్రి మాల్యాద్రిరావు, ఎన్ కృష్ణ, ఎం జాకాబ్, కస్తూరి శ్రీనివాసరావు, బొడ్డుపల్లి శ్రీరామ చంద్రమూర్తి, కొమ్మూరి సీతా రామాంజనేయులు పాల్గొన్నారు.




వైసిపి కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న బాలాజీ

అందుబాటులో ఉంటా : బాలాజీ

ప్రజాశక్తి - పర్చూరు

ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని, మరోసారి జగనన్నను సిఎంగా, తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని వైసిపి ఇన్‌ఛార్జి యడం బాలాజీ కోరారు. పర్చూరు ప్రజలకు సేవ చేసుకునేందుకు అవకాశం కల్పించాలని కోరారు. వైసిపి కార్యాలయాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను సమన్వయకర్తగా నియమించడంపట్ల జగన్ మోహన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గంలో చాలా సమస్యలు వున్నాయని అన్నారు. వాటన్నింటినీ పూర్తిగా పరిష్కరించే విదంగా కృషి చేస్తానని తెలిపారు. కార్యకర్తలు నేరుగా వారి సమస్యలు పరిష్కారానికి తనను కలసుకోవచ్చని తెలిపారు. మైనింగ్, ఇసుక, మట్టి మాఫియాకు తాము పూర్తిగా వ్యతిరేకమని తెలిపారు. అవి నిర్వహించేవారిని తాను ఉపేక్షించనని హెచ్చరించారు. సంక్షేమ పథకాలు అందించడమే వైసిపి అజెండా అన్నారు. ఈపాటికే జగనన్న 33సంక్షేమ పథకాలను అమలు చేశారని అన్నారు. వాటిని కొనసాగించేందుకు జగనన్నను మరోసారి సిఎం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ కటారి అప్పారావు, మాజీ ఎంపీపీ కొల్లా వెంకటరావు, గాజుల రమేష్, ఎంపీపీ ఆనంద కుమారి, వైస్ ఎంపీపీ కోట ప్రసన్నశ్రీనివాస్, జెసిఎస్ కన్వీనర్ ఎం రాఘవయ్య పాల్గొన్నారు.



ఎంఎల్ఎ ఏలూరితో జాగర్లమూడి ఎస్‌సిలు

ఏలూరిని కలిసిన దళితులు

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని జాగర్లమూడి గ్రామానికి చెందిన దళిత కాలనీ వాసులు శనివారం ఇసుకదర్శిలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును మర్యాద పూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు.



మాట్లాడుతున్న మహంతి

ఆక్వా రైతులకు అవగాహన

ప్రజాశక్తి - నిజాంపట్నం

స్థానిక తూనుగుంట్ల ఇంద్రగుప్తా, హేమంత్ ప్లాంట్ నందు ఆక్వా రొయ్య సాగు రైతులకు అవంతి ఫీడ్స్ లిమిటెడ్ తరపున జనరల్ మేనేజర్ ఎస్ మహంతి అధ్యక్షతన సాంకేతిక సదస్సు శనివారం నిర్వహించారు. అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాలతో శాస్త్ర బద్ధంగా సమ పాళ్ళ పోషక విలువలతో తక్కువ ఖర్చుతో రైతులు ఎక్కువ ఆక్వా సాగు ఉత్పత్తిపై సాంకేతిక పద్ధతి రైతులకు అర్థమయ్యే రీతిలో వివరించారు. రైతులకు యాజమాన్య పద్ధతుల్లో వచ్చే సమస్యలను ఎలా ఎదుర్కోవాలో వివరించారు. ఆక్వా సాగు ఎక్కువ చేసే దేశాలైన థాయిలాండ్, చైనా, మలేషియా, ఇండోనేషియా వంటి దేశాల కన్నా మన దేశ నాణ్యత ప్రమాణాలు, పోషక విలువలు పెంపొందేటట్లు గుర్తింపు పొందిన ఫీడ్స్‌ను రైతులు ఉపయోగించుకుని అధిక లాభాలు గడించాలని సూచించారు. ధరలు వ్యత్యాసం గురించి ప్రభుత్వంతో ఇటీవల సంప్రదింపులు జరిపామని తెలిపారు. ప్రభుత్వం కూడా రైతుకు గిట్టు బాటు ధర కల్పించేందుకు సానుకూలంగా స్పందించిందని తెలిపారు. కె రంగారెడ్డి, ఎహెచ్‌సీపీ ప్రోడక్ట్ మేనేజర్ పి శ్రీనివాస్, టాస్ మేనేజర్ పిఎస్ఎన్ మూర్తి, గుంటూరు, కృష్ణా జిల్లాల రీజినల్ మేనేజర్ టి హేమంత్, అవంతి డీలర్ టి ఇంద్రగుప్తా, నిజాంపట్నం, అవంతి టెక్నికల్ టీం పాల్గొన్నారు.



ఇసుక మాఫియా అక్రమాలపై టిడిపి, జనసేన ఆందోళన

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలోని పెదలంక సమీపాన అరవింద్ వారధి దగ్గరలో అక్రమంగా ఇసుక తవ్వకాలను ఆపివేయాలని టిడిపి, జనసేన నాయకులు ఇసుక రీచ్‌లో శనివారం నిరసన చేపట్టారు. అనంతరం తహశీల్దారుకు, పోలీసులకు ఇసుక అక్రమాలను అరికట్టాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆ పార్టీ నాయకులు బరితెగించి ఇసుక అక్రమ దందా చేస్తూ కోట్లు గడిస్తున్నారని ఆరోపించారు. ప్రజలకు మంచి చేస్తారని నమ్మి మేరుగ నాగార్జునను గెలిపిస్తే ఆయన అవినీతి మత్తులో సంపాదనే ధ్యేయంగా ఇసుక అక్రమ తవ్వకాలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కనకాల మధుసూధన ప్రసాద్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబు, టిడిపి అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయ్ బాబు, జనసేన మండల అధ్యక్షులు బొందలపాటి చలమయ్య పాల్గొన్నారు.



పోలీసులు అదుపులోకి తీసుకున్న జూదరులు

జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలోని అక్కాయ్యపాలెం పంచాయతీ శివారులో పేకాట ఆడుతున్న ఐదుగురిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. పేకాట ఆడుతున్న వారి వద్ద నుండి రూ.42వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. జూదగాలను పోలీసు స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చనున్నట్లు తెలిపారు. ఈ దాడిలో చీరాల రూరల్ సీఐ నిమ్మగడ్డ సత్యనారాయణతో పాటు వేటపాలెం ఎస్ఐ జి సురేష్ పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు

- పట్టించుకోని అధికార యంత్రాంగం
- చోద్యం చూస్తున్న పాలకులు

ప్రజాశక్తి - వేటపాలెం

రోడ్ల వెంట కిలోమీటర్ల దూరం అడ్డగోలుగా అక్రమంగా తవ్వకాలు కొనసాగుతున్నాయి. పట్టించుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తున్నారు. పాలకులు సైతం చోద్యం చూస్తూ వదిలేస్తున్నారు. దీంతో అక్రమ తవ్వకం దారులు పేచ్చరిల్లి పోతున్నారు. వివరాల్లోకి వెళితే మండలంలోని చల్లారెడ్డిపాలెం పంచాయతీలో నూతనంగా నిర్మించిన సచివాలయం-2 కార్యాలయంకు కూతవేటు దూరం నుండి పొట్టి సుబ్బయ్యపాలెం వైపుకు రెండు కిలోమీటర్లపైగా తారు రోడ్డు వెంబడి ప్రోక్లైన్లతో తవ్వకాలు చేస్తున్నారు. గత రెండు రోజుల నుండి నిరాటకంగా తవ్వకాలు కొనసాగుతున్నప్పటికీ అటువైపు స్థానిక అధికార యంత్రాంగం కన్నెత్తి చూడటం లేదు. స్థానికులను ఆరా తీస్తే రొయ్యల ఫ్యాక్టరీలకు వాటర్ పైపులైను వేస్తున్నట్లు చెబుతున్నారు. పైపులైను వేసుకోవటం బాగానే ఉన్నప్పటికీ వాల్టా చట్టాన్ని తుంగలో తొక్కి కనీసం పంచాయితీ తీర్మానం, అనుమతులు ఏమీ లేకుండానే భారీ ప్రోక్లైన్లతో రోడ్డు వెంట కిలోమీటర్ల దూరం అడ్డగోలుగా



రోడ్డు వెంట ప్రొక్లెయిన్‌తో తవ్వుతున్న దృశ్యం

అక్రమ తవ్వకాలు చేయటాన్ని బట్టి చూస్తే అక్రమార్కులతో లోపాయికారి ఒప్పందాలు చేసుకున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికార యంత్రాంగంతో పాటు నిఘా వర్గాలు సైతం ఈ విషయంపై మిన్నకుండి పోవటంలో గల ఆంతర్యం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని రోడ్ల వెంట అక్రమ తవ్వకాలు నిలుపుదల చేయాలని, ప్రభుత్వ నిబంధనల మేరకు నడుచుకునే విధంగా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

టిడిపి టిక్కెట్ నాకే : కొండయ్య

- నాయకులు కార్యకర్తలు అధైర్య పడవద్దు
- చివరి జాబితాలోనైనా అధిష్టానం ప్రకటిస్తుంది

ప్రజాశక్తి - చీరాల

టిడిపి అధ్యక్షులు చంద్రబాబు ప్రకటించిన ఎమ్మెల్యే అభ్యర్థుల తొలి జాబితాలో తన పేరు లేకపోవడంపై నాయకులు, కార్యకర్తలు ఎవరు అపోహ పడవద్దని, అధిష్టానం టిక్కెట్టు తనకే ప్రకటిస్తుందని టిడిపి ఇన్చార్జి ఎంఎం కొండయ్య చెప్పారు. టిడిపి అభ్యర్థుల తొలి జాబితా ప్రకటించిన నేపథ్యంలో స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో శనివారం మాట్లాడారు. అధిష్టానం తనను చీరాల ఇంచార్జిగా బాధ్యతలు అప్పగించినప్పటి నుండి పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళుతూ టిడిపి బలోపేతానికి ఎంతగానో కృషి చేశానని అన్నారు. తన కష్టాన్ని గుర్తించిన అధిష్టానం తప్పకుండా తనకు సీటు కేటాయిస్తుందని తెలిపారు. గతంలో నియోజకవర్గ ముఖ్య నేతల సమక్షంలో తనతో చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చారని గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రజలు విసిగిపోయారని అన్నారు. ప్రస్తుతం ప్రజలు చంద్రబాబును విశ్వసిస్తున్నారని అన్నారు. సూపర్ సిక్స్ మేనిఫెస్టో ప్రజలకు ఎంతగానో మేలు చేస్తుందని అన్నారు. చీరాలలో టిడిపి మంచి



మాట్లాడుతున్న ఎంఎం. కొండయ్య

ఆదరణ ఉందని, తన గెలుపుకు ప్రజలందరూ సహకరిస్తారని అన్నారు. 30వేల మేజార్టీతో టిడిపి జెండా ఎగరవేస్తానని ధీమా వ్యక్తం చేశారు. ప్రతి ఎన్నికల్లో చీరాల అభ్యర్థి సీటు చివరి క్షణంలో ప్రకటిస్తారనే విషయం ప్రజలందరికీ తెలుసని అన్నారు. అయితే కొందరు వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. అధిష్టానం చివరి జాబితాలోనైనా తన పేరు ప్రకటిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్షులు గజవల్లి శ్రీనివాసరావు, కౌతవరపు జనార్ధన్, డేటా నాగేశ్వరరావు, పార్థసారథి, పురుషోత్తం, సురేష్ పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచార రథం ప్రారంభం

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

టిడిపి ఎమ్మెల్లే అభ్యర్థిగా ఏలూరి సాంబశివరావును టిడిపి అధినేత చంద్రబాబు శనివారం ప్రకటించడం పట్ల టిడిపి శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వైసిపి సృష్టించిన ప్రభంజనంలో ఎంతోమంది టిడిపి హేమాహేమీలు పరాజయం పాలైనప్పటికీ పర్చూరులో రెండు సార్లు గెలుపొంది రికార్డ్ సాధించిన ఏలూరి మూడోసారి ఎమ్మెల్లే అభ్యర్థిగా పోటీ చేయనున్నారు. పర్చూరులో టిడిపికి అభ్యర్థి లేని రోజుల్లో ఏలూరి సాంబశివరావు వచ్చి పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లి బలమైన అభ్యర్థిగా నిలిచారని టిడిపి శ్రేణులు పేర్కొన్నారు. మార్టూరు మండలం కోనంకి గ్రామానికి చెందిన ఏలూరి నాగేశ్వరరావు, సుశీలమ్మ దంపతుల కుమారుడు సాంబశివరావు ప్రాథమిక విద్య గ్రామంలోని ఎయుసి స్కూల్, గగణపరవం ఎపి రెసిడెన్షియల్ స్కూల్, గుండ్లపల్లి నాగభైరవ జూనియర్ కాలేజిలో ఇంటర్ చదివారు. ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బిఎస్సి, ఎమ్మెస్సీ (హార్టీ కల్చరల్) పూర్తిచేశారు.



ప్రచార రథం ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ ఏలూరి

టిడిపి ఇచ్చిన పిలుపు మేరకు రాజకీయాల్లోకి వచ్చిన ఆయన సేవా కార్యక్రమాలే లక్ష్యంగా లక్ష మందికి కంటి చూపు అందించాలనే సంకల్పంతో కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. పేదల జీవితాల్లో వెలుగు నింపుతూ మెరుగైన వైద్యం అందిస్తున్నారు. ఈసందర్భంగా ఎన్నికల ప్రచార రథాన్ని ఆయన ఇసుకదర్శిలోని తన క్యాంపు కార్యాలయంలో టిడిపి నాయకుల సమక్షంలో కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించారు.

వ్యర్థాలతో ప్రజల ఇక్కట్లు

ప్రజాశక్తి - పర్చూరు

గ్రామాల్లోని వ్యర్థపదార్థాలను తెచ్చి ప్రధాన రహదారుల ప్రక్కనే వేయడంతో ప్రయాణికులకు ప్రాణ సంకటకంగా మారింది. పర్చూరు పరిసర గ్రామాల్లోని వ్యర్థాలు వాహనాల్లో తెచ్చి చీరాల రోడ్డు ప్రక్కన వాగు వైపు వేస్తున్నారు. కొన్ని రోజుల తర్వాత దానిని తగలబెట్టడం సర్వసాధారణమైంది. దీనివల్ల దట్టంగా వస్తున్న పొగ రోడ్డుపై వ్యాపిస్తుంది. దట్టమైన పొగ రోడ్డుపై ప్రయాణించే వాహన చోదకులకు ప్రమాద కరంగా మారింది. పొగ వల్ల ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ప్రమాదాలు బారిన పడే పరిస్థితి ఏర్పడింది. పొగను దాటే సమయంలో ఆ పొగ పీల్చడం వల్ల ఊపిరి తిత్తుల్లోకి చేరి వ్యాధుల బారిన పడాల్సి వస్తుందని ప్రయాణికులు, పాదచారులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా జోక్యం చేసుకుని వెంటనే చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.



టిడిపిలో చేరిన కాపు యువకులు

టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - బాపట్ల

తెలుగు యువత అధ్యక్షులు ఉమ్మారెడ్డి వెంకటేష్ నాయుడు ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన కాపు యువకులు 70మంది టిడిపి ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్ర వర్మ సమక్షంలో టిడిపిలో చేరారు. పట్టణంలోని చీలు రోడ్డు నుండి భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో నరేంద్ర వర్మ చేతుల మీదుగా టిడిపి కండువాలు కప్పుకొని టిడిపిలో చేరారు.



నూతన గృహప్రవేశంలో పాల్గొన్న ఆనందబాబు

మాజీ మంత్రి ఆనందబాబు పర్యటన

ప్రజాశక్తి - భట్టిప్రోలు

భట్టిప్రోలు గ్రామానికి చెందిన టిడిపి నాయకులు బట్టు మల్లికార్జునరావు నూతన గృహప్రవేశంలో మాజీ మంత్రి నక్కా ఆనందబాబు శనివారం పాల్గొన్నారు. భట్టిప్రోలులో నివాసం ఉంటూ వ్యాపార రీత్యా ఆంధ్ర ప్యారిస్‌గా పేరు గాంచిన తెనాలిలో మల్లికార్జున గృహం ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని అన్నారు. నియోజకవర్గంలో టిడిపి అభివృద్ధికి, బీసీల సంక్షేమానికి మల్లికార్జునరావు ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. బీసీలంతా ఏకతాటిపై నడిచి, బీసీలకు ప్రత్యేక గుర్తింపును అందించిన టిడిపి గెలుపుకు కృషి చేయాలని ఆనందబాబు కోరారు.



ఓటు హక్కుపై ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

ఓటు హక్కుపై ర్యాలీ

ప్రజాశక్తి - బట్టిప్రోలు

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అనేది ప్రతి ఒక్కరి బాధ్యతని, దానిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దారు సిహెచ్ పద్మావతి సూచించారు. స్థానిక టీఎం రావు ఉన్నత పాఠశాల విద్యార్థులచే పాఠశాల నుండి బస్టాండ్ సెంటర్ వరకు స్వీప్ప అవగాహన ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్లో మానవహారం నిర్వహించారు. విద్యార్థులచే ఎన్నికల ట్రైనర్ గుర్రం మురళీమోహన్ నినాదాలు చేశారు. తహశీల్దారు పద్మావతి మాట్లాడుతూ 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు హక్కు పొందాలని కోరారు. ప్రజా సేవ చేసే నిజాయితీపరుడైన నాయకుడిని ఎన్నుకోనేందుకు దోహదపడుతుందని అన్నారు. ఓటు హక్కు ప్రజల చేతిలో వజ్రాయుధం లాంటిదని అన్నారు. బుల్లెట్ కంటే బలమైనది బ్యాలెట్ అని అన్నారు. ర్యాలీ అనంతరం భట్టిప్రోలు పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈవీఎంల పనితీరును మురళీ మోహన్ వివరించారు. వెల్లటూరు జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులచే రూపొందించిన ఈవిఎం మిషన్, బ్యాలెట్ బాక్స్ దాని పని తీరు, ఓటు హక్కు విని యోగించుకునే విధానాన్ని క్షుణ్ణంగా వివరించారు. పాఠశాల హెచ్ఎం సిహెచ్ రామ కోటేశ్వరరావు, ఎంఇఒ నీలం దేవరాజ్, ఎస్ఐ శ్రీనివాసరావు, డిటి శ్రీనివాస్, వీఆర్ఒలు శివరామ కృష్ణ, అంబటి ప్రసాద్, రత్నాకర్, వెంకటేశ్వరరావు, రాజేష్, కోట శ్రీనివాసరావు, కౌతరపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.



టిడిపిలో చేరిన వారితో ఎమ్మెల్యే స్వామి

టిడిపిలో చేరిక

శింగరాయకొండ : శింగరాయకొండ మండలం సోమరాజు పల్లి గ్రామానికి 10 కుటుంబాల వారు టిడిపిలో చేరారు. వారికి ఎమ్మెల్యే డోలాశ్రీ బాల వీరాంజనేయ స్వామి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టిడిపిలో చేరిన వారిలో బొడ్డు నాగరాజు, దగ్గుబాటి వేణు, బొడ్డు బంగారమ్మ, కనిగంటి మస్తానమ్మ, అల్లరి నరేష్ బొడ్డు స్వాతి గౌతమ్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు మించల బ్రహ్మయ్య, బాలకోటయ్య పాల్గొన్నారు.

టంగుటూరు : జరుగుమల్లి మండలం వావిలేటిపాడు గ్రామానికి చెందిన 20 మంది టిడిపిలో చేరారు. ఎమ్మెల్యే స్వామి వారికి టిడిపి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. వావిలేటిపాడుకు చెందిన వైసిపి నాయకుడు మల్లవరపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కలికివాయి మాధవరావు, మల్లవరపు నాగేశ్వరరావు, కలికివాయి వెంకటేశ్వర్లు, నూతలపాటి నాగ మురళి, రావినూతల యేసు, మల్లవరపు అంజయ్య, కలికివాయి వినోద్, మల్లవరపు నరసింహారావు, మరికొందరు టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో జరుగుమల్లి మండల టిడిపి అధ్యక్షులు పోకూరి రవీంద్రబాబు, నాయకులు పోటు శ్రీనివాసమురళి , దగ్గుమాటి సుబ్బారెడ్డి, నరాల సోమయ్య, నవులూరి పూర్ణశేఖర రావు పాల్గొన్నారు.

బిఎల్ఒలతో సమావేశం

కొండపి : కొండపి నియోజక వర్గ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పిస్తామని ఎన్నికల రిటర్నింగ్ అదికారి ఎ.కుమార్ తెలిపారు. నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా శనివారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన తహశీల్దార్లు, బిఎల్ఒలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు పోలింగ్ కేంద్రాలను పరిశీలించి అక్కడ ఏమైన సౌకర్యాలు కొరవడితే పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరు మండలాల తహశీల్దార్లు, అధికారులు, బిఎస్ఒలు పాల్గొన్నారు.

26న 'జయహో బీసీ' సభ

ఒంగోలు కలెక్టరేట్ : ఒంగోలులోని బృందావనం ఫంక్షన్ హాలులో ఒంగోలు పార్లమెంట్ స్థాయి 'జయహో బీసీ' సభ ఈనెల 26న నిర్వహిస్తున్నట్లు టిడిపి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నూకసాని బాలాజీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వెనుకబడిన బడుగు, బలహీన వర్గాల సమస్యలపై, బీసీల అభివద్ధికి కోసం తీసుకోవాల్సిన భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక, రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపే ధ్యేయంగా చేపట్టాల్సిన కార్యాచరణ తదితర అంశాలపై చర్చిస్తామన్నారు. ఒంగోలు పార్లమెంట్ స్థాయిలోని అన్ని నియోజకవర్గాల నుంచి రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ, అనుబంధ విభాగాల కమిటీలలోని బడుగు బలహీనవర్గాలు, బీసీ నాయకులు, బీసీ సాధికార సమితి కమిటీ సభ్యులు, కార్యకర్తలు, మహిళలు, అందరూ పాల్గొని జయహో బీసీ సభను విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

27న ర్యాలీని జయప్రదం చేయాలి

ఒంగోలు సబర్బన్ : జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 27న విజయవాడలో నిర్వహిస్తున్న ర్యాలీ, నిరసన దీక్ష, ప్రదర్శనను జయప్రదం చేయాలని ఆన్ పెన్షనర్స్, విశ్రాంత పర్సన్స్ అసోషియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జి.శేషయ్య, సిహెచ్. రాంబాబు శనివారం ఓ ప్రకటనలో కోరారు. పెన్షనర్ల డిఎ, డిఆర్ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. ఐఆర్ వెంటనే ప్రకటించాలని, రిటైర్డ్ అయిన వారికి చెల్లించాల్సిన పిఎఫ్, ఎపిజిఎల్ఐ, జిఐఎస్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. కనీస పెన్షను పదివేలు ఇవ్వాలని, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్‌ను వెంటనే రెగ్యులర్ చేయాలనే డిమాండ్‌తో ర్యాలీ, ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పమిడి కోటయ్య ఉద్యమ స్ఫూర్తితో

సిపిఎం బలోపేతానికి కృషి

- పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు పూనాటి ఆంజనేయులు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

సిపిఎం జిల్లా నేత పమిడి కోటయ్య ఉద్యమ స్ఫూర్తితో జిల్లాలో సిపిఎం బలోపేతానికి కృషి చేయాలని ఆపార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు పూనాటి ఆంజనేయులు పిలుపు నిచ్చారు. సిపిఎం జిల్లా సీనియర్ నేత పమిడి కోటయ్య వర్ధంతి సభ సుందరయ్య భవన్‌లో శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా కోటయ్య చిత్ర పటానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభలో పూనాటి ఆంజనేయులు మాట్లాడుతూ జిల్లాలో పార్టీని నిర్మించడంలో కీలక పాత్ర పోషించిన నేత పమిడి కోటయ్య అని తెలిపారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు జిల్లాలో పార్టీ వైపు ఎవరూ లేకపోయినా పమిడి కోటయ్య ఒక్కరే నిలబడ్డారని వివరించారు. ఒక్కరే జిల్లాలో పార్టీ విస్తరణకు, నిర్మాణానికి కృషి చేశారని తెలిపారు. పొందూరులో జన్మించిన పమిడి కోటయ్య ఆగ్రామ సర్పంచిగా 30 సంవత్సరాలు పాటు పనిచేశారని చెప్పారు. గ్రామ ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారని తెలిపారు. 1989లో పార్టీ జిల్లా కార్యాలయం నిర్మాణానికి కృషి చేశారన్నారు. పమిడి కోటయ్య ఉద్యమ స్ఫూర్తితో జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు జాలా అంజయ్య మాట్లాడుతూ పమిడి కోటయ్య విద్యార్థి దశనుంచే కమ్యూనిస్టు పార్టీలో ఉన్నారన్నారు. విద్యార్థి దశలోనే అండర్ గ్రౌండ్‌లోకి వెళ్లారని తెలిపారు. పొందూరులో కమ్యూనిస్టు పార్టీని నిర్మించి సర్పంచిగా పనిచేశారన్నారు. పార్టీ చీలిక సమయంలో నక్సల్స్‌వైపు వెళ్లిన తవనం చెంచయ్య, సూరా పాపిరెడ్డిలను పమిడి కోటయ్య సిపిఎం వైపు తీసుకు వచ్చారని వివరించారు. జిల్లాలో పార్టీని నిర్మించడంలో కీలక పాత్ర పోషించారన్నారు. జిల్లాలో సిపిఎం పునరుద్ధరణకు కృషి చేసిన పమిడి కోటయ్య ఆశయాలను ముందుకు తీసుకు వెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపు నిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ మాట్లాడుతూ పమిడి కోటయ్య ఒక్కరే పార్టీ ఉద్యమాన్ని నిర్మించడంలో కీలక భూమిక పోషించారని చెప్పారు. ఆయన ఉద్యమ స్ఫూర్తితో జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జివి.కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, షేక్ మాబు, కంకణాల ఆంజనేయులు, జిల్లా కమిటీ సభ్యులు కాలం సుబ్బారావు, జి.శ్రీనివాసులు, పి.కల్పన, బి.రఘురాం, తోట తిరుపతిరావు, వి.బాలకోటయ్య, నగర నాయకులు టి. మహేష్, గంథం నరసయ్య, ఎంఎల్‌వి.ప్రసాదరావు, సువర్ణరాజు, కె.బాలచంద్రం, జి.శేషయ్య, ప్రజా సంఘాల నాయకులు కెఎఫ్.బాబు, వినోద్, కంకణాల వెంకటేశ్వర్లు, సూదనగుంట నరసింహారావు, రజిని, షేక్ అమీర్, ఎ.బ్రహ్మయ్య, జి.రవికుమార్, కె.గురుస్వామి పాల్గొన్నారు.



ఒంగోలులో కోటయ్య చిత్రపట్టం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



కొండపిలో నివాళులర్పిస్తున్న నాయకులు

కొండపి : పమిడి కోటయ్య కమ్యూనిస్టు ఉద్యమం నిర్మాణంలో నిర్వహించిన పాత్రను, త్యాగాలను స్మరించుకొని ఆయన ఆశయాల సాధనకు అంకితమవుదామని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు అన్నారు. సిపిఎం ప్రకాశం జిల్లా ప్రథమ కార్యదర్శి, రైతు ఉద్యమ నేత పమిడి కోటయ్య వర్ధంతి స్థానిక బస్టాండ్ సెంటర్లో నిర్వహించారు. ఈ సందర్భంగా కోటయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. అనంతరం కంకణాల ఆంజనేయులు ధనిక రైతు కుటుంబం నుంచి కోటయ్య వచ్చిన అత్యంత సాధారణమైన జీవితాన్ని గడుపుతూ వ్యవసాయ రంగ పరిరక్షణ కోసం, పొగాకు బోర్డు స్థాపన పోరాటాలు సాగించారని గుర్తు చేశారు. కమ్యూనిస్టు ఉద్యమంపై అప్పటి ప్రభుత్వం అనేక నిర్బంధాలను ప్రయోగించినా కోటయ్య బయపడ కుండా అరెస్టులు, జైళ్ళ, అజ్ఞాత జీవితం గడిపారని తెలిపారు. సిపిఎం మండల కార్యదర్శి కెజి.మస్తాన్ మాట్లాడుతూ టంగుటూరు మండలం పొందూరులో జన్మించిన కోటయ్య చుట్టు ప్రక్కల గ్రామాలలో కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటుకు పునాదులు వేశారని తెలిపారు. పెరిదేపి, వేములపాడు, మిట్టపాలెంలో అనేక పోరాటాలకు నేతృత్వం వహించారన్నారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకులు వై.చంద్రశేఖర్, సిపిఎం మండల నాయకులు వై.రూబెను, అంగలకుర్తి సూరిబాబు, గడ్డం వందనం, జి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గృహ ఆధారిత విద్య తీరుతెన్నుల పరిశీలన

ప్రజాశక్తి- కొత్తపట్నం

మండల పరిధిలోని రాజు పాలెం,కొత్త పట్నం గ్రామాల్లో నిర్వహిస్తున్న గృహ ఆధారిత విద్య తీరు తెన్నులను సమగ్ర శిక్ష సహిత విద్యా జిల్లా ఇన్‌ఛార్జి మరియు అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ ఎం. రమేష్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. గహ ఆధారిత విద్య ఉపయోగాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొత్తపట్నం చాకిరేవుమిట్ట ప్రాథమిక పాఠశాలను సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ పద్మావ, రిసోర్స్ పర్సన్ శ్రీను పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల్లో పరిశీలన

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలంలో గ్రూప్ 2 పరీక్షలకు రెండు పరీక్షా కేంద్రాలు సిద్ధం చేశారు. పిఎన్‌సిఎ డిగ్రీ కళాశాల, మలినేని సుశీలమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. పిఎన్‌సిఎ కళాశాలలోని పరీక్షా కేంద్రంలో 400 మంది, మలినేని సుశీలమ్మ ఇంజినీరింగ్ కళాశాలలోని పరీక్షా కేంద్రంలో 500 మంది పరీక్షకు హాజరు కానున్నారు. పరీక్షా కేంద్రాలను శింగరాయకొండ సిఐ దాచేపల్లి రంగనాథ్, ఎస్ఐ టి.శ్రీరామ్ ఎఎస్ఐ మహబూబ్ బాషా శనివారం పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సిఐ తెలిపారు. ఎలాంటి మాస్ కాపీంగ్ జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.



పరీక్షా కేంద్రంలో పరిశీలిస్తున్న సిఐ

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- మద్దిపాడు

మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో అభివద్ధి పనులకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున శనివారం శంకుస్థాపన చేశారు. అదేవిధంగా వైఎస్ఆర్ రైతు భరోసా, సచివాలయాలు, ప్రైమరీ హెల్త్ సెంటర్ నూతన భవనాలను ప్రారంభించారు. మల్లవరం, అన్నంగి, కీర్తిపాడు, కొలచన కోట, రాచవారిపాలెం, వెల్లంపల్లి, నాగన్నపాలెం గ్రామాలలో వైఎస్ఆర్ రైతు భరోసా, సచివాలయాలు, ప్రైమరీ హెల్త్ సెంటర్ల భవనాలను ప్రారంభించారు. అదే విధంగా రూ.3,29 కోట్ల విలువైన నాలుగు వేలు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వాకా అరుణ కోటిరెడ్డి, మండల అధ్యక్షుడు అప్పారావు, మాజీ ఎంపిపి నారా విజయలక్ష్మి, వైస్ ఎంపిపి వెంకట్రావు, ఆయా గ్రామాల సర్పంచులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెండింగ్ ఫారమ్స్ పూర్తి చేయాలి

కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో పెండింగ్‌లోనున్న ఓటర్ల ఫారమ్స్‌ను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, జిల్లా అధికారులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు ఎలా వేయాలో డెమో ద్వారా చూపించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు వెంటనే గుర్తించాలన్నారు. కౌంటింగ్ సెంటర్ల వివరాలు వెంటనే తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకష్ణ, మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, డిఆర్ఒ ఆర్.శ్రీలత, ఒంగోలు, కనిగిరి ఆర్‌డిఒలు వి.విశ్వేశ్వరరావు, జాన్‌ఎర్విన్, జిల్లా ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, వైసిపి రాష్ట్ర ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి దామరాజు క్రాంతికుమార్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి ఎస్‌కె.రసూల్, టిడిపి ప్రతినిధి స్వరూప్, బిజెపి ప్రతినిధి బసినేపల్లి రాజశేఖర్, గుర్రం సత్యం, సిపిఎం ప్రతినిధి బి. రఘురామ్, ఎఇఆర్‌ఒలు, తహశీల్దార్లు, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.